తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





## అందరికీ మంచి జరిగేలా రామమందిరం ఒక సంకేతం

### -అయోధ్యలో టిటిడి ఛైర్మన్ కరుణాకర్‌రెడ్డి



తిరుమల, జనవరి 22ప్రభాతవార్తప్రతినిధి: అందరికీ మంచి ,శాంతి జరిగేలా అయోధ్యనగరంలో రామమందిరం ఒక సంకేతం, సందేశం, తాత్విక ఉద్దేశ్యంగా మారుతుందని టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి విశ్వసించారు. సోమవారం ఉదయం అయోధ్యలో రామందిరం ప్రారంభోత్సవంలో పాల్గొనడం తన జీవితం ధన్యమైందని, ఈ శుభ సందర్భంలో అయోధ్యకు తరలివచ్చిన హిందువులకు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులు కూడా లభిస్తాయని చెబుతూ లక్ష లడ్డూలు పంపిణీ చేశారు. భారతదేశంలో ఉన్న రామభక్తులు, ప్రపంచంలో ఉన్న హిందువులు అంతా ఒక్కటై ,రామ నామాన్ని జపిస్తూ ,జగమంతా రామమయం అనే నినాదంతో ప్రపంచం మారుమోగిందన్నారు.

## నేడు విధిగా అన్ని పాఠశాలల్లో మాక్ పోలింగ్

### - కలెక్టర్ సగిలి షన్మోహన్ ఆదేశం

చిత్తూరు, జనవరి 22 ప్రభాతవార్త:

జిల్లాలోని అన్ని పాఠశాలల్లో విధిగా మాక్ పోలింగ్ నిర్వహించడానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ సగిలి షన్మోహన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుండి సోమవారం కలెక్టర్ సగిలి షన్మోహన్ తహసిల్దార్లు, ఎంపిడిఓలు, ఎంఇఓలతో పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన, ఓటర్ల దినోత్సవం నిర్వహణ, స్వీప్ యాక్టివిటీస్‌పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంగళవారం పాఠశాలల్లో మాక్ పోలింగ్ నిర్వహణతో విద్యార్థుల్లో ఓటు హక్కును ఎలా వినియోగం చేసుకొంటారనే విషయంపై అవగాహన ఏర్పడుతుందన్నారు. తద్వారా వారి తల్లిదండ్రులు ఓటు హక్కును వినియోగించుకొనేలా పిల్లలు ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించడానికి అవకాశం వుంటుందన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్ఓ రాజశేఖర్, డిఆర్‌డిఎ పిడి డిఎంకె తులసీ, డిఇఓ విజయేంద్రరావు, ఎస్ఎస్ఎ పిఓ వెంకటరమణారెడ్డి, మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ, డిఎల్‌డిఎ రవికుమార్, ఐసిఓఎల్ డిప్యూటీ కలెక్టర్ గంగాభవానీలు పాల్గొన్నారు.

## జడ్పీకి అంచనా ఆదాయం

# రూ.4,133 కోట్లు

**పోలింగ్ కేంద్రాల్లో పక్కాగా మౌళిక వసతులు**
**హైవే, ఎక్స్‌ప్రెస్ హైవేల ప్రక్కన కచ్చితంగా సర్వీస్ రోడ్లు**
**స్టాండింగ్ కమిటీ సమావేశంలో జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు**




జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు.

చిత్తూరు, జనవరి 22 ప్రభాతవార్త:

జిల్లా పరిషత్‌కు 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 4,133.08 కోట్ల రూపాయల ఆదాయం రానున్నదని అలాగే ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లా పరిషత్ ద్వారా 3,629.52 కోట్ల రూపాయల ఖర్చు జరుగనుందని అంచనా వేసినట్లు జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు అన్నారు. జడ్పీ ఛైర్మన్ ఛాంబర్‌లో సోమవారం జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు అధ్యక్షతన 1, 7 జడ్పీ స్థాయి సంఘ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జడ్పీ ఛైర్మన్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియకు సంబంధించి జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో మౌళిక వసతులను కలెక్టర్ ఆదేశాల మేరకు సత్వరం చేపట్టి పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందని, ఈ కార్యక్రమాలు వివిధ శాఖల ద్వారా నిర్వహించినా వాటికి సంబంధించిన నిధులు జడ్పీ నుండి వెచ్చించడం జరుగుతుందన్నారు. జిల్లాకు ముఖ్యమంత్రి ఇస్తానని చెప్పిన మేరకు పనులు మంజూరు చేశారని, కుప్పం హంద్రీ-నీవా కాలువ ద్వారా నీటిని విడుదల చేశామని నీరు రామకుప్పం వరకు వచ్చిందన్నారు. జిల్లాలో జల జీవన్ మిషన్ పనులు వేగవంతంగా పూర్తి చేసి అందరికి స్వచ్ఛమైన నీరు అందించడానికి చర్యలు తీసుకొంటున్నామన్నారు. పంచాయతీరాజ్ ద్వారా జిల్లాలో జరుగుతున్న భవన నిర్మాణాలను త్వరితంగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఎస్ఎ చంద్రశేఖర్‌రెడ్డిని జడ్పీ ఛైర్మన్ ఆదేశించారు. జిల్లాలో హైవే, ఎక్స్‌ప్రెస్ హైవేల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని, ఈ నిర్మాణాల్లో ముందు ప్రతిపాదించిన మేరకు సర్వీస్ రోడ్డు కచ్చితంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే కుప్పం, పలమనేరు, వి.కోటల్లో అతిథి గృహాలు పూర్తి స్థాయిలో పునర్‌నిర్మాణం చేయాల్సి వుంటుందని, అలాగే బోయకొండ మల్లయ్య కొండ, దుర్గం కొండ తదితర ప్రాంతాల్లో అతిథి గృహాలు నిర్మించడానికి

# వైభవంగా శ్రీసీతారాముల కళ్యాణం

కాణిపాకం, జనవరి 22 ప్రభాతవార్త:

అయోధ్య శ్రీరామ జన్మభూమి మందిరంలో బాలరాముడి ప్రతిష్ట సందర్భాన్ని పురస్కరించుకుని కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో సోమవారం శ్రీసీతా రాముల కళ్యాణోత్సవంను అత్యంత ఘనంగా నిర్వహించారు. కాణిపాకం దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీశ్రీదేవి, భూదేవి సయిత శ్రీవరదరాజస్వామి ఆలయంలో కళ్యాణోత్సవంను నిర్వహించారు. ఆలయ ముందు భాగంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కళ్యాణ వేధిక వద్ద శ్రీసీతా రాముల దివ్య కళ్యాణోత్సవంను నిర్వహించారు. ఈసందర్భంగా ప్రధాన ఆలయం నుండి శ్రీసీతారాముల వారి విగ్రహాలను మంగళ వాయిద్యాల నడుమ ఆలయ మాడా వీధుల గుండా ఊరేగింపుగా వరదరాజస్వామి ఆలయంకు తీసుకువచ్చారు. అలాగే ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు, స్థానిక సర్పంచ్ కెఎస్.శాంతిసాగర్‌రెడ్డి దంపతులు, ఆలయ అధికారులు, ఉభయదారులు కలసి స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను ఊరేగింపుగా తీసుకువచ్చి సమర్పించారు. అనంతరం ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా శ్రీసీతా రాముల కళ్యాణోత్సవంను నిర్వహించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. స్వామి, అమ్మవార్ల కళ్యాణోత్సవంను



స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఊరేగిపుంగా తీసుకువస్తున్న ఆలయ ఛైర్మన్ దంపతులు, ఈఓ తదితరులు.

## గూడూరులో వైభవంగా శోభాయాత్ర

### - జై శ్రీరామ్ నామస్మరణతో మార్మోగిన గూడూరు



గూడూరు, జనవరి 22 ప్రభాతవార్త

అయోధ్యలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకొని గూడూరు పట్టణంలోని నరసింగరావుపేట రామాలయంలో, జానకి రాంపేట రామాలయంలో, గాంధీనగర్ విశ్వేశ్వరాలయంలో, ఆంజనేయస్వామి ఆలయంలో, ఇందిరమ్మ కాలనీ ఆంజనేయ స్వామి ఆలయంలో గూడూరు అర్బన్ మండల అధ్యక్షుడు అరికట్ల బాలకృష్ణ నాయుడు, సీనియర్ బిజెపి నాయకులు సంజీవ నాయుడు, బిజెవైఎం రాష్ట్ర నాయకులు మనోజ్‌కుమార్, గూడూరు అసెంబ్లీ కోకన్వీనర్ నరేంద్ర, టౌన్ ప్రధాన కార్యదర్శి గుంజి శ్రీనివాసరావు, సాయిలక్ష్మణ్, ఉపాధ్యక్షులు నందిమండలం రవీంద్ర రాజు, ఐ.సురేష్‌బాబులు అన్ని దేవాలయాల భక్తుల ఆధ్వర్యంలో రామ నామ జపాలతో భజనలతో శోభాయాత్ర సాగింది. ముఖ్య అతిథులుగా గూడూరు అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ పాపారెడ్డి పురుషోత్తంరెడ్డి, తిరుచ్చి ప్రముఖ పారిశ్రామికవేత్త చాలా వాసుదేవ రావు పాల్గొన్నారు. అనంతరం స్థానిక టవర్‌క్లాక్ సెంటర్ నుంచి జరిగిన శోభాయాత్రలో బజారులోని వ్యాపారులు, ఆర్ఎస్ఎస్, విశ్వ హిందూ పరిషత్, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## శ్రీరాముని విగ్రహ ప్రతిష్ట చారిత్రాత్మకం

### బియ్యపు మధుసూధనరెడ్డి



శ్రీకాళహస్తిలో హనుమంత వాహనంపై శ్రీరామచంద్రమూర్తి

శ్రీకాళహస్తి, జనవరి 22 ప్రభాతవార్త

సమాజంలోని ప్రతి ఒక్కరు శ్రీరాముని ఆదర్శంగా తీసుకొని జీవించాలని అయోధ్య రామయ్య అనుగ్రహం ప్రతి ఒక్కరికి ఉండాలని 500 సంవత్సరాల తరువాత రామాలయం నిర్మించి ప్రధాని నరేంద్రమోదీ చరిత్ర సృష్టించారని స్థానిక శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి అన్నారు. సోమవారం శ్రీకాళహస్తీశ్వరాలయం ఏర్పాటు చేసిన ఆయోధ్యలో శ్రీరాముని విగ్రహం ప్రతిష్ట సందర్భంగా ధార్మిక, ఆధ్యాత్మిక చింతన కార్యక్రమాలు ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమాలకు ఎంఎల్ఏ బియ్యపు మదుసూధనరెడ్డి ముఖ్యఅతిధిగా విచ్చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ఆయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ట పూజలు చారిత్రాత్మకం అన్నారు. ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ నేడు ఆయోధ్యలో ప్రధాని నరేంద్రమోదీ ఓ చరిత్ర సృష్టించారన్నారు. ప్రపంచ దేశాల్లో ఆయోధ్య పేరు ప్రతిష్టలను శ్రీరాముని చరిత్రను చాటి చెప్పటానికి పేనుకొని చరిత్రసృష్టించారన్నారు.

**చాతుర్మాడ వీధుల్లో గ్రామోత్సవం:**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నెహ్రూవీధిలో వెలసిన పట్టాభిరాముని ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామలక్ష్మణ స్వాముల ఉత్సవర్లను విశేష దివ్యాలంకార చేసి విశిష్ట పూజలు జరిపారు. అనంతరం గ్రామోత్సవానికి ఉత్సవర్లను హనుమంత వాహనంపై ప్రతిష్టించారు. చాతుర్మాడ వీధుల్లో ఊరేగింపు జరిపారు. మంగళ వాయిద్యాలు, కోలాటాలు, భజనలు శ్రీరామనామ స్మరణతో జగదభిరాముని అనుగ్రహ దర్శనం భక్తులకు కల్పించారు. ఈ సందర్భంగా బియ్యపు పవిత్రారెడ్డి భక్తులకు అక్షింతలు అందిస్తూ ముందుకు సాగారు. ఈ కార్యక్రమాల్లో ధర్మకర్తల మండలి సభ్యులు బుల్లెట్ శ్యాం, కొండూరు సునీత, రమాప్రభ, లక్ష్మీ, పసల సుమతి, ప్రత్యేకాహ్వానితులు జూలుగంటి సుబ్బరావు, చింతా మణి పాండు బిజెపి నాయకులు కోలా ఆనంద్‌కుమార్, బి,చంద్రప్ప, పూల కృష్ణమూర్తి, ఉప్పు కృష్ణయ్య, అంజూరు బాల సుబ్రమణ్యం, స్వర్ణమూర్తి, పగడాల రాజు, టౌన్‌బ్యాంక్ అధ్యక్షుడు శెట్టిపల్లి సురేష్, గరికపాటి రమేష్, ఇఓ కె.యస్.రామారావు, ఎఇఓ వెంకటసుబ్బయ్య, సతీష్‌కుమార్, నాగభూషణం, సుదర్శనం నాయుడు, లక్ష్మయ్య, బాలాజి, స్థపతి కుమార్ తదితరులు ఎపాల్గొన్నారు.

# జనానికి చేరువగా జనరిక్ మందులు

### 50 నుంచి 90 శాతం తక్కువ ధరకు మందులు లభ్యం : మంత్రి రోజా



నగరి, నవరి 22 ప్రభాతవార్త:

జనరిక్ మందులను జనానికి చేరువ చేస్తున్నామని మంత్రి రోజా అన్నారు. స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో నూతనంగా ఏర్పాటు చేసిన జనరిక్ మెడికల్ షాపును సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న సహకారంతో సహకార సంఘాలు అభివృద్ధి బాట పట్టాయన్నారు. ప్రస్తుత పాలనలో నగరి సహకార సంఘానికి రూ.42 లక్షల వ్యయంతో నూతన భవనం, ఆర్థికంగా బలోపేతం చేయడానికి రూ.29 లక్షల వ్యయంతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించామన్నారు. రైతులు వేడుకలు, సమావేశాలు నిర్వహించుకోవడానికి రూ.67 లక్షల వ్యయంతో ఫార్మర్ ఫంక్షన్ హాలు మంజూరు చేయగా నిర్మాణంలో ఉందన్నారు. రైతు గత ఏడాది ఇదే తేదీన సహకార సంఘం రూ.30 లక్షల వ్యయంతో పెట్రోల్ బంకును ప్రారంభించి నిర్వహణ చేపట్టి లాభాల బాటలో నడుస్తోందన్నారు. ప్రస్తుతం జనరిక్ మందుల విక్రయాలను ప్రారంభించిందన్నారు. 1616 మందులు ఈ షాపుల్లో 50 నుంచి 90 శాతం వరకు తక్కువ ధరకు విక్రయించడం జరుగుతుందన్నారు. జనరిక్ మందుల విక్రయాలు ప్రారంభించడంలోను పెట్రోలు బంకు ప్రారంభంలోను, పీహెచ్‌సీల ఆధునికీకరణలో అర్బన్ హెల్త్ సెంటర్లు నిర్మించడంలో జిల్లాలో నగరి ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. నగరి నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు తీస్తుందంటే అది ముఖ్యమంత్రి ఆశీస్సులతోనే అన్నారు. మంచి చేసే ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో ప్రజలు తమ ఆశీస్సులు అందించాలన్నారు. కార్యక్రమంలో డీసీవో బ్రహ్మానందం రెడ్డి, డీఎల్‌సీవో వనజ, నగరి పీఏసీఎస్ ఛైర్మన్ తిరుమలరెడ్డి, సీఈవో తులసిపిళ్లై, పీఏసీఎస్ డైరెక్టర్లు దామునాయుడు, నాగరత్నం, పేక్స్ డెవలప్‌మెంట్ సెల్ అధికారి శ్రీనివాసులు, పాక్స్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు విజయకుమార్‌రెడ్డి, కార్యదర్శి రమేష్, డీసీసీబీ సూపర్‌వైజర్లు ఆనంద్, కార్తీక్, ఆర్‌బీకే ఛైర్మన్ బుజ్జిరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కో-ఆప్షన్ సభ్యులు, ఆ ప్యాక్స్, డీసీసీబీ, పీఏసీఎస్ సిబ్బంది, వైఎస్సీపీ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## 24న జిల్లాకు రాష్ట్ర ముఖ్యమంత్రి రాక



తిరుపతి కార్పొరేషన్, జనవరి 22, ప్రభాతవార్త

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈ నెల 24న జిల్లాలో పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణారెడ్డి తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ నెల 24న బుధవారం సాయంత్రం గన్నవరం విమానాశ్రయం నుండి బయలుదేరి 4.05 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారు. 4.30 గంటలకు తాజ్ హోటల్‌లో జరుగనున్న ఇండియా టుడే ఎడ్యుకేషన్ సమ్మిట్ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం సా. 5.30 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుని తిరుగు ప్రయాణం కానున్నారని జిల్లా కలెక్టర్ తెలిపారు.

## 836 మంది అంగన్‌వాడీ సిబ్బందిపై వేటు

చిత్తూరు, జనవరి 22 ప్రభాతవార్త:

జిల్లాలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ పరిధిలో విధులు నిర్వహిస్తున్న 836 మంది అంగన్‌వాడీ సిబ్బందిపై ప్రభుత్వం వేటు వేసింది. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె ప్రారంభించారు. ప్రభుత్వం వీరి సమ్మెను విరమింప చేయడానికి పలు సమస్యలను పరిష్కరించినప్పటికీ సమస్యలు పూర్తిగా పరిష్కారం అయ్యే వరకు సమ్మె తప్పదని అంగన్‌వాడీ సిబ్బంది స్పష్టం చేశారు. దీంతో ప్రభుత్వం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలపై ఎస్మా చట్టంను ప్రయోగించింది. ఈ మేరకు విధులకు హాజరు కాకుంటే పూర్తి స్థాయిలో తొలగిస్తామని ప్రభుత్వం హెచ్చరించింది. ఈ మేరకు జిల్లాలో ఇప్పటి వరకు 836 మంది అంగన్‌వాడీ సిబ్బంది విధులకు హాజరు కాలేదని గుర్తించిన స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారులు ఈ మేరకు వీరికి ఊస్టింగ్ ఆర్డర్స్ జారీ చేశారు. స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారులు ఇంటికి పంపిన అంగన్‌వాడీ సిబ్బందిలో అంగన్‌వాడీ కార్యకర్తలు 327 మంది వున్నారు. ఇందులో బైరెడ్డిపల్లి 48, కార్వేటినగరం 56, కుప్పం 101, పలమనేరు 47, శాంతిపురం 75 మంది వున్నారు. అలాగే 166 మంది మినీ అంగన్‌వాడీ కార్యకర్తలపై వేటు పడగా ఇందులో బైరెడ్డిపల్లి 11, కార్వేటినగరం 14, కుప్పం 56, పలమనేరు 20, శాంతిపురం 65 మంది వున్నారు. అలాగే 343 అంగన్‌వాడీ ఆయాలపై వేటు పడగా ఇందులో బైరెడ్డిపల్లి 46, కార్వేటినగరం 57, కుప్పం 108, పలమనేరు 58, శాంతిపురం 74 మంది వున్నారు.

## తిరుపతి జిల్లాలో పలువురు సిఐలకు కొత్త పోస్టింగ్‌లు

తిరుపతి, జనవరి 22ప్రభాతవార్త:

సార్వత్రిక ఎన్నికలకు సమయం దగ్గరపడుతుండటంతో ఒకేచోట మూడేళ్ళు ఆపైగా పనిచేస్తున్న పోలీసు అధికారులను ప్రభుత్వం బదిలీ చేస్తోంది. ఇప్పటికే తిరుపతి జిల్లాలో పలువురు సిఐలను గుర్తించి మరోచోటుకు బదిలీ చేసిన పోలీసు ఉన్నతాధికారులు ,ఆయా సర్కిల్ స్థానాల్లో సోమవారం కొందరికి కొత్తవారికి పోస్టింగ్ లిస్తూ అనంతపురం రేంజి డిఐజి ఆర్ఎన్అమ్మిరెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. తిరుపతి జిల్లాలో శ్రీకాళహస్తి 1టౌన్ సిఐగా అనంతపురం విఆర్‌లో ఉన్న ఎస్‌వి నరసింహారావును నియమించారు. విఆర్‌లో ఉన్న సిఐ శ్రీరామ శ్రీనివాసులును ఏర్పేడు సర్కిల్‌కు , సత్యవేడు సిఐగా ఎం.దివాకర్‌రెడ్డిని, పుత్తూరు అర్బన్ సర్కిల్‌కు పాకాల సిఐ ఓబులేశును, ఏర్పేడు సిఐ వి.శ్రీహరిని బిఎన్‌కండ్రిగ సిఐగా పోస్టింగ్ ఇచ్చారు. వీరంతా రెండురోజుల్లో ఆయా స్థానాల్లో బాధ్యతలు చేపట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## స్పందన అర్జీలను సత్వర పరిష్కారం చూపాలి

### జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి



తిరుపతి కార్పొరేషన్, జనవరి 22, ప్రభాతవార్త

స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ కె. వెంకట రమణారెడ్డి జిల్లా అధికారులను ఆదేశిం చారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్ర మంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌తో కలిసి స్పందన గ్రీవెన్స్ అర్జీలను స్వీకరించారు. వీరితో పాటు డిఆర్ఓ పెంచల్ కిషోర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కోదండరామిరెడ్డి, కె.పి. శ్రీనివాస్, భవాని శంకర్ జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించి, స్పందన ఆన్‌లైన్ నమోదుతో రసీదులు అందించారు. మొత్తం 96 వినతులు రావడం జరిగిందని జిల్లా అధికారులు అందురు వచ్చిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా పరిష్కరించాలని స్పందనకు హాజరైన వివిధ శాఖలకు సంబంధించిన జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

# జిల్లాలో 15.58 లక్షల ఓటర్లు

### 2024 ఓటర్ల తుది జాబితా విడుదల



చిత్తూరు, జనవరి 22 ప్రభాతవార్త:

జిల్లాలో మొత్తం ఓటర్లు 15,58,257 మంది ఓటర్లు వున్నారని, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ నిరంతర ప్రక్రియ అని కలెక్టర్ సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో సోమవారం కలెక్టర్ సగిలి షన్మోహన్ 2024 తుది ఓటర్ల జాబితాను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 7,65,903 మంది పురుష ఓటర్లు, 7,88,725 మంది మహిళా ఓటర్లు, 84 మంది ట్రాన్స్ జెండర్లు, 3,379 మంది సర్వీస్ ఓటర్లు, 166 మంది ఎన్ఆర్ఐ ఓటర్లు వున్నారన్నారు. అలాగే నూతనంగా 18-19 సంవత్సరాల మధ్య వయసు కల్గిన 33,495 మంది యువ ఓటర్లు నూతనంగా ఓటు హక్కును పొందారన్నారు. ఓటర్ల నమోదు, మార్పులు చేర్పులు నిరంతర ప్రక్రియ అని ఓటర్ల నమోదుకు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఓటర్ల జాబితాపై గత సందేహాలను నివృత్తి చేయడం కోసం రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. రెవెన్యూ అధికార యంత్రాంగం ఆరు నెలలుగా కసరత్తు చేసి పారదర్శకమైన ఓటర్ల జాబితాను సిద్ధం చేసిందన్నారు. అలాగే ఓటు నమోదుకు నామినేషన్ల దాఖలుకు పది రోజుల ముందు వరకు దరఖాస్తులు చేసుకోవడానికి అవకాశం వుంటుందన్నారు. తుది ఓటర్ల జాబితాలో పేరు లేదని ప్రజలు ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. తుది ఓటర్ల జాబితాను బెంచ్ మార్క్‌గా భావించాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులకు జిల్లా అధికార యంత్రాంగం నిరంతరం అందుబాటులో వుంటుందన్నారు. క్షేత్ర స్థాయిలో ఎలాంటి సమస్య వచ్చిన తన దృష్టికి లిఖిత పూర్వకంగా తీసుకురావాలన్నారు. గతంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశాల్లో ఇచ్చిన అభ్యంతరాలను పరిశీలించడం జరిగిందన్నారు. ఎలక్షన్ కమీషన్ రూపొందించిన యాప్ లో అధికంగా ఓటర్లు నమోదు చేసుకొన్నారన్నారు. బిఎల్ఓలు ప్రతి ఇంటికి వెళ్ళి క్షేత్ర స్థాయిలో ఓటర్ల పరిశీలన చేశారన్నారు. పారదర్శకమైన ఓటర్ల జాబితా కోసం బిఎల్ఓలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఇంటింటి సర్వేలో వచ్చిన ప్రతి అభ్యంతరం, మార్పులు, చేర్పులను పకడ్బందీగా పరిశీలించడం జరిగిందన్నారు. ఐదు కంటే ఎక్కువ అభ్యంతరాలు వచ్చిన వాటిని ప్రత్యేక కమిటీతో పరిశీలన చేయించడం జరిగిందన్నారు. అలాగే మృతి చెందిన ఓటర్లను సంబంధిత ఆధారాలతో తొలగించడం జరిగిందన్నారు. ఇటీవల జారీ చేసిన డ్రాఫ్ట్ రోల్ పైనే మార్పులు చేర్పులు చేయడం జరిగిందన్నారు. తుది ఓటర్ల జాబితా కాపీలను జిల్లాలోని అన్ని తహసిల్దార్ల కార్యాలయాలు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు పంపడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ రాజశేఖర్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీ ప్రసన్న, ఎలక్షన్ సెల్ సూపరిటెండెంట్ బ్యూలా, బిజెపి నాయకులు అట్లూరి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, రాష్ట్ర దేశం నాయకులు వెంకిటీల సురేంద్రకుమార్, వైకాపా ప్రతినిధి ఉదయ్‌కుమార్, కాంగ్రెస్ ప్రతినిధి భాస్కర్, పరదేశి, ఆమ్ ఆద్మీ ప్రతినిధి లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## స్పందనకు 277 సమస్యలు



చిత్తూరు, జనవరి 22 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సగిలి షన్మోహన్ ఆధ్వర్యంలో జరిగే స్పందన కార్యక్రమానికి ఈ వారం జిల్లా నలుమూలల నుండి సమస్యలపై ప్రజలు 277 అర్జీలను అధికారులకు అందజేశారు. స్పందన కార్యక్రమానికి ఈ వారం జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్ఓ రాజశేఖర్‌లు హాజరై ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ అర్జీలను పరిశీలించి సత్వరం సమస్యలను పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను వారు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అత్యధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించి 206 అర్జీలు అందాయి. జిల్లా పౌర సరఫరాల శాఖకు సంబంధించి 23, డిఆర్‌డిఎ 17 సమస్యలు అందాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆలయాల్లో భక్తజన కోటి ఆనంద హేల

## - కుప్పంలోని ఆలయాల్లో విశేష పూజలు.. అన్నదానాలు !!

కుప్పం, జనవరి 22 ప్రభాతవార్త

అయోధ్యనగరంలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్టను పురస్కరించుకుని భక్తజన కోటి ఆనందభరితులయ్యారు. కుప్పం పట్టణంలో సోమవారం పలు ఆలయాల్లో విశేష పూజలు, అభిషేకాలు, అన్నదానాలు జరిపారు. పట్టణంలోని శ్రీరామలింగేశ్వరాలయంలో ఉదయం నుంచే ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. హిందుధర్మ పరిరక్షణ వేదిక సభ్యుల అధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. అలాగే టిబి రోడ్‌లో జ్యువెలర్స్ అసోసియేషన్ అధ్వర ్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. స్థానిక శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో ఛైర్మన్ కుమరేష్ నేతృత్వంలో ఉదయం నుంచే పెద్ద ఎత్తున పూజలు, అన్నదానం చేపట్టారు. ఈసందర్భంగా భక్తులు విగ్రహ ప్రతిష్ట తిలకించేందుకు ఆలయం వద్ద స్క్రీన్ ఏర్పాటుచేశారు. సాయంత్రం పట్టణంలో ఉత్తర భారతీయులు (సేట్)లు దీపాలతో ర్యాలీ నిర్వహించారు. మండలంలోని కంగుంది దుర్గం వద్ద శ్రీ ఆంజనేయస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్సీ డా॥కంచర్ల శ్రీకాంత్, తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర నేత గోపీనాథ్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. న్యాయవాది శ్రీకాంత్ సురేష్ అధ్వర్యంలో శ్రీరాముడి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేపట్టారు.

**రామకుప్పం :** అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ట సందర్భంగా రామకుప్పంలో ఘనంగా ఉత్సవాలు నిర్వహించారు. స్థానిక ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. ఈసందర్భంగా



శ్రీరామచంద్రుడి ఉత్సవ విగ్రహంను పుర వీధుల్లో ఊరేగించారు. పెద్ద ఎత్తున టపాకాయలు పేల్చారు. భక్తులకు అన ్నదానం చేశారు. సాయంత్రం ప్రతి ఇంటా దీపాలు వెలిగించి శ్రీరామస్మరణ చేశారు.

**శాంతిపురం:** అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా మండలంలోని ప్రతి గ్రామంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, శ్రీరామస ్మరణలు మార్మోగాయి. గ్రామాల్లో సింధూరపు రంగు తోరణాలు కట్టారు. రాళ్లబూదుగూరు కోదండరాయాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. శాంతిపురంలో సైతం అన్నదానం జరిపారు. భక్తులు ర్యాలీ నిర్వహించారు. సాయంత్రం ఇళ్ల వద్ద దీపాలు వెలిగించారు. పలుగ్రామాల్లో రామకోటి, పండరి భజనలు జరిపారు. ఎంకే పురంలో భారీ కటౌట్లకు పూజలు చేశారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## అయోధ్య రాముడి ప్రాణప్రతిష్టతో మిన్నంటిన సంబరాలు

తవణంపల్లె, జనవరి 22 ప్రభాతవార్త:



మండల వ్యాప్తంగా ప్రజల శ్రీరామనామ జపంతో మార్మోగింది. మండలంలోని పలు ఆలయాలు, భజన మందిరాలు భక్తులతో కిక్కిరిశాయి. శ్రీఅర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానంలో ఆలయ ఛైర్మన్ పి.సురేంద్రారెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అలాగే అరగొండ శ్రీకోదండరామస్వామి దేవస్థానం, టి.పుత్తూరు, తవణంపల్లె, జొన్నగురకల, మత్యం, దిగువమాఘం ఎగువ వెంకటాపురం శ్రీకోదండరామస్వామి ఆలయాలు భజన మందిరాల్లో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఇదిలా వుండగా టి.పుత్తూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన 34 అడుగు అభయ ఆంజనేయస్వామి విగ్రహాన్ని ఆవిష్కరించారు.

## ప్రోటోకాల్ పాటించేలా చర్యలు తీసుకోవాలి - తెదేపా నేతలు

గుడుపల్లె, జనవరి 22 ప్రభాతవార్త



కుప్పం సమీపంలో నిర్మించిన వన్నియకుల క్షత్రియ భవనం ప్రారంభోత్సవం సందర్భంగా అధికారులు ప్రోటోకాల్ పాటించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం తెదేపా నేతలు గుడుపల్లె తహశీల్దార్, ఎస్సైలకు ఫిర్యాదు చేశారు. గుత్తార్లపల్లి వద్ద సర్వే నెం 237/4లో సుమారు ఎకరం భూమిని, దాదాపు రెండు కోట్ల నిధులను గతంలో చంద్రబాబునాయుడు సిఎంగా ఉన్న సమయంలో మంజూరు చేశారన్నారు. తెదేపా హయాంలోనే తొంభైశాతం పనులు పూర్తయ్యాయన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వైకాపా నేతలు మిగతా పదిశాతం పనులు నాసిరకంగా చేసి హడావుడిగా భవన నిర్మాణ ప్రారంభంకు శిలాఫలకాలు తయారు చేశారన్నారు. ఈ శిలాఫలకాల్లో ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్లు లేకుండా ప్రోటోకాల్ పాటించకుండా రూపొందించారన్నారు. ఈ విషయంగా శాంతిభద్రతల సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ ఆర్. చంద్రశేఖర్, మాజీ ఎ ంపిపిలు మునిరాజు, సాంబ శివం, నేతలు మురళి, ఎవి రవి, కాణిపాకం వెంకటేష్, పార్థసారథి, డా॥కృష్ణ, ఈశ్వర్‌లు పాల్గొన్నారు.

## మంత్రి సమక్షంలో వైకాపాలోకి

పుంగనూరు, జనవరి 22 , ప్రభాతవార్త:



మండలంలోని చంద్రమాకులపల్లి గ్రామానికి చెందిన ఆరు కుటుంబాలు మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో వైకాపాలో చేరారు. సోమవారం ఉదయం మంత్రి గృహం వద్ద జరిగిన ఈకార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ మంచి చేయాలనే తపనతోనే పుంగనూరుకు అనేక సదుపాయాలు తీసుకువస్తున్నామన్నారు. పార్టీనాయకులు అలకంబాబు అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చంద్రమాకులపల్లి గ్రామానికి చెందిన అహ్మద్,గులాం,ఖాజా,అల్లాబక్షులతో పాటూ గ్రామానికి చెందిన వై.నారాయణ, కే.హరీష్‌లు వైకాపాకు విధేయులుగా పనిచేస్తామని వివరించారు.

## రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వృద్ధురాలు మృతి

కుప్పం, జనవరి 22 ప్రభాతవార్త

కుప్పం- గుడుపల్లె రైలు మార్గంలో 253/300-400కి.మీ.ల రాయి సమీపంలో రైలు నుంచి జారి పడి ఓ గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెంది ఉండడాన్ని గుర్తించినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ నాగరాజు తెలిపారు. మృతురాలికి సుమారు అరవై ఏళ్ల వయసు ఉంటుందని రోజాపువ్వు కలరు చీర ధరించి ఉందన్నారు. మృతురాలిని గుర్తించిన వారు కుప్పం రైల్వే పోలీసులను సంప్రదించాలన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

## సెబ్ సి.ఐ.గా సృజన్ బాబు బాధ్యతలు

కుప్పం, జనవరి 22 ప్రభాతవార్త

కుప్పం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) నూతన సి.ఐ.గా సృజన్ బాబు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన కర్నూలు జిల్లా కోస్గి నుంచి కుప్పంకు బదిలీ అయ్యారు. ఇక్కడ సిఐగా ఉన్న కిషోర్‌కుమార్ అనంతపురం జిల్లా ఉరవకొండకు బదిలీ అయ్యారు. ఈసందర్భంగా సెబ్ సిఐ సృజన్ బాబు మాట్లాడుతూ కర్ణాటక మద్యం, నాటుసారా తయారీ, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.

## శ్రీరామ శ్రీరామా అంటూ ఘోషించిన పుంగనూరు

పుంగనూరు, జనవరి 22, ప్రభాతవార్త:



అయోధ్యలో శ్రీరామమందిరం ప్రారంభం సందర్భంగా పుంగనూరులో శ్రీరామా శ్రీరామా జయజయరామా అంటూ కీర్తిస్తూ వేలాది మంది ప్రజలు పట్టణంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. హిందువులందరూ కలసి ఉదయం పట్టణంలోని శ్రీవాసవీమాత ఆలయం వద్దనుంచి ర్యాలీ ప్రారంభించారు. పట్టణంలో పెద్దఎత్తున సాగిన ఈర్యాలీలో హిందూ మహిళలు శ్రీరామభజన చేస్తూ, కీర్తనలు ఆలపిస్తూ అలరించగా, శ్రీసీతా,రామ లక్ష్మణ,ఆంజనేయ వేషధారణలతో చిన్నారులు అలరించారు. కాషాయ జెండాల రెపరెపలతో పట్టణం క్రిక్కిరిసిపోయింది. కార్యక్రమాలను ఆర్‌ఎస్‌ఎస్,హిందూజాగరణ,ఆర్యవైశ్య సంఘాలు పర్యవేక్షించాయి.

04 జెపిజి : పుంగనూరులో శ్రీసీతారామలక్ష్మణ,ఆంజనేయ వేషధారణలతో చిన్నారుల ప్రదర్శన

## రోడ్డు విస్తరణలో కూడా పార్టీ వివక్షతా..? -సుహేల్‌బాషా

పుంగనూరు, జనవరి 22, ప్రభాతవార్త:

పట్టణంలో సాగుతున్న రోడు ్డ విస్తరణ కార్యక్రమంలో అధికారులు సమన్యాయం పాటించలేదని తెలుగుదేశం నాయకుడు సయ్యద్‌సుహేల్ ఆరోపించారు. ఈసందర్భంగా మండల పరిషత్తు కార్యాలయం ఎదురుగా ఉన్న నిరుపేద ముస్లిం కుటుంబ ఇంటిని పూర్తిగా తొలగించారన్నారు. ఇదే విస్తరణలో వైకాపా నాయకులు,మద్దతుదారుల ఆస్తులను మినహాయించారని పేర్కొన్నారు. వైకాపా నాయకుల ఆస్తులున్న చోట్ల 40 అడుగులు, సామాన్యజనం ఉన్నచోట్ల 80 అడుగుల పరిధిలో ఆస్తులు కూల్చేస్తున్నారన్నారు. అధికారులు దీనిపై స్పందించాలని కోరారు.

## అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి

కుప్పంరూరల్, జనవరి 22 ప్రభాతవార్త

మండలంలోని బంగానత్తం చెరువులో అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన సామగుట్టపల్లికి చెందిన రవి కుమారుడు సంజయ్ (29) మృతదేహాన్ని ఫైర్ సిబ్బంది వెలికితీశారు. శనివారం సాయంత్రం ముగ్గురు మందితో కలసి సంజయ్ బంగానత్తం చెరువు వద్దకు చేరుకున్నాడని అక్కడ తెప్పల్లో కూర్చుని తిరుగుతున్న సమయంలో తెప్ప బోల్తా పడిందని దీంతో సునీల్ చెరువులో పడిపోయాడని మిగతా ముగ్గురు తెలిపినట్లు మృతుడి కుటుంబీకులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆదివారం నుంచి కుప్పం ఫైర్ అధికారి ప్రవీణ్‌కుమార్ నేపథ్యంలో ఫైర్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టగా సోమవారం యువకుడి మృతదేహాన్ని వెలికి తీసి పోలీసులకు అప్పగించారు. పోలీసులు మృతదేహాన్ని పంచనామాకు తరలించారు. సంఘటనా సమయంలో ఉన్న ముగ్గురు యువకులను పోలీసులు విచారిస్తున్నట్లు తెలిసింది.

## కుష్ఠు, క్షయ నిర్మూలనకు కృషి చేద్దాం : వెంకటప్రసాద్

చౌడేపల్లి, జనవరి 22 ప్రభాతవార్త

కుష్ఠు, క్షయవ్యాధుల నిర్మూలనకు కృషి చేద్దామని అదనపు జిల్లా వైద్యాధికారి వెంకటప్రసాద్ సూచించారు. సోమవారం స్థానిక ఆరోగ్య కేంద్రాన్ని పర్యవేక్షించారు. ఆరోగ్యం పరిధిలోని 21క్షయ, 4కుష్ఠువ్యాధి గ్రస్తుల ఆరోగ్య పరిస్థితులను గురించి అడిగి తెలుసుకొన్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తారనీ, అదే విధంగా పౌష్టికాహారానికి రూ. 500లు వారి బ్యాంకు ఖాతాల్లోకి జమచేస్తారన్నారు. అనంతరం క్షయ, కుష్ఠువ్యాధి గ్రస్తుల రికార్డులు తనిఖీ చేసారు. వైద్యాధికారి పవన్‌కుమార్, డాక్టర్ పూజ, డిపిఎంఒ దేవ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## మురిసిన చౌడేపల్లి

చౌడేపల్లి, జనవరి 22 ప్రభాతవార్త



అయోధ్యలో బాల రామయ్య విగ్రహ ప్రాణప్రతిష్ట సందర్భంగా సోమవారం మండలంలోని రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాలన్నీ భక్తులతో నిండిపోయాయి. జైశ్రీరామ్ అంటూ యువత పలు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్థానిక కమలాంజనేయస్వామి ఆలయంలో కమిటీ బృందంచే స్వామివారి ఊరేగింపు, బస్టాండులో అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేసారు. కమలాంజనేయస్వామి, హిందూ ధర్మపరిరక్షణ సమితిచే ఇంటింటికీ రామ నామాలు, శ్రీరాముని ప్రతిమగల జెండాలను ఆవిష్కరించారు. ఎటు చూసినా రామనామ జపంతో మండలం మార్మోగింది.

## రాములవారి ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు

సదుం,జనవరి22పభాతవార్త

మండలంలో పలు చోట్ల రామాలయాలల్లో సీతారాముల విగ్రహాలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సదుంలోని చెన్నకేశవస్వామివారి ఆలయం, వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి అమ్మవారి ఆలయాలలో ఉన్న సీతారాముల విగ్రహాలకు ఆలయాల అర్చకులు ప్రత్యేంగా పూజలు చేశారు. నడిగడ్డ వెంకటరెడ్డిగారిపల్లెలోని సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో గ్రామస్థుల ఆధ్వర్యంలో ఉదయం అభిషేకాలు జరగ్గా సాయంత్రం స్వామి వారి కల్యాణోత్సవం కన్నుల పండువగా అర్చకులు రఘునాధరావు నిర్వహించారు.

## త్వరితంగా మరుదు పాండియార్స్ పార్కు నిర్మాణం

### - ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు, జనవరి 22 ప్రభాతవార్త: చిత్తూరు గంగినేని చెరువు పరిసరాల్లో మరుదు పాండియన్ సోదరుల మెమోరియల్ పార్కు నిర్మాణ పనులను త్వరంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. చిత్తూరు రిలయన్స్ మార్ట్ ఎదుట గంగినేని చెరువు ఆవరణలో సోమవారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మరుదు పాండియన్ సోదరుల మెమోరియల్ పార్కు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ ఛైర్మన్ బుల్లెట్ సురేష్ కృషితో చిత్తూరులో మరుదు పాండియన్ సోదరుల మెమోరియల్ పార్కు ఏర్పాటు అవుతుందన్నారు. మరుదు పాండియన్ వారసులు రామస్వామి, మేయర్ ఆముద, కమీషనర్ డాక్టర్ జె.అరుణ, చుడా ఛైర్మన్ పురుషోత్తంరెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాహుల్‌రెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ మొదలియార్, వెల్ఫేర్ బోర్డు సభ్యులు గుణశేఖరన్, సుగుణాంబాల్, జగదీష్, బాల కృష్ణ, కార్పొరేటర్లు మురళీ, ఆల్లీ, కుట్టిరాయల్, లక్ష్మణన్, ఎకె రవి, హేములు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## అరెస్టలతో ఉద్యమాన్ని ఆపలేరు : సిఐటియు

గూడూరు, జనవరి 22, ప్రభాతవార్త



ప్రభుత్వం పోలీసుల నిర్బంధాలు,అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని సిఐటియు నాయకులు పేర్కొన్నారు. అంగన్వాడిల రిలే నిరాహారదీక్షలు సోమవారానికి 42 రోజులకుచే రుకున్నాయి. తమన్యాయపరమైన డిమండ్లను తీర్చాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి అధ్యక్షురాలు ఎ. ఇంద్రావతి, కార్యదర్శి బిఎస్ ప్రభావతి, రైతు సంఘం నాయకులు జోగి శివకుమార్, గూడూరు పట్టణ సిఐటియు అధ్యక్షులు బివి రమణయ్య, కార్యదర్శి ఎస్. సురేష్, సెక్టార్ లీడర్లు మునికుమారి,లక్ష్మి,పెంచలమ్మ, సుబ్బయ్య, ఏ. ప్రసాద్, బి. చంద్రయ్య, గుర్రం రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి అరెస్టు చేయడం దారుణం

### సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు చంగయ్య

వెంకటగిరి, జనవరి 22, ప్రభాతవార్త

అంగన్వాడి కార్యకర్తలను విజయవాడలో పోలీసులు అరెస్టు చేయడం దారుణమని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు వడ్డీపల్లి చంగయ్య ఖండించారు. వెంకటగిరి 42వ రోజు అంగన్వాడీలు నిరసన చేశారు. అంగన్‌వాడి సిబ్బంది సమ్మెను ప్రభుత్వం నిర్వీరం చేసేందుకు ఇబ్బంది పెడుతున్నట్లు తెలిపారు. ఉద్యోగాల నుండి తొలగిస్తామని భయపెడుతున్నట్లు చెప్పారు. ఈ ప్రభుత్వానికి పట్టణం తప్పదని తెలిపారు. అంగన్‌వాడిల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు.

## నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటా

### మాజీ మంత్రి నేదురుమల్లి రాజలక్ష్మి

వెంకటగిరి, జనవరి 22, ప్రభాతవార్త



వెంకటగిరి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానని ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి తెలిపారు. సోమవారం ఆమె వెంకటగిరిలోనే నివాస గృహానికి వచ్చి పార్టీ కార్యకర్తలు నాయకులు మాట్లాడారు. వెంకటగిరి నియోజకవర్గ ప్రజలకు ఇక అందుబాటులో ఉంటానని ఆమె తెలిపారు. తనను ప్రజలు తరచూ కలుస్తుంటారని ఆమె చెప్పారు. నియోజకవర్గం ప్రజలతో మమేకమై పార్టీ గెలుపు కృషి చేస్తానని చెప్పారు. ఆమె వెంట వైసిపి జిల్లా అధ్యక్షులు రాంకుమార్ రెడ్డి, నాయకులు కోటేశ్వర రావు, సిపిఎల్ నరసింహారావు, గణేష్ రెడ్డి, రమేష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్యే సంజీవయ్యను కలిసిన వైసీపీ నేతలు

ఓజిలి, జనవరి 22 ప్రభాతవార్త



సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యను సోమవారం ఎమ్మెల్యే కార్యాలయంలో వైసీపీ సీనియర్ నేత, మానమాల ఉప సర్పంచ్ ఉచ్చూరు హరినాథ్‌రెడ్డి, వెంకటరెడ్డిపాలెం యువ నాయకుడు ఉగ్గుముడి సంతోష్‌కుమార్‌రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచనచం అందజేశారు. పూలమాలలు వేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఉచ్చూరు హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో సూళ్లూరుపేట అసెంబ్లీ వైసీపీ అభ్యర్థి కిలివేటి సంజీవయ్య విజయం కోసం అహర్నిశలు కృషి చేస్తామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు.

## శ్రీరామచంద్రునికి లక్ష తులసీ అర్చన

సూళ్లూరుపేట, జనవరి 22 ప్రభాతవార్త

స్థానిక శ్రీ బాలాంజనేయస్వామి దేవస్థానంలో సోమవారం లక్ష తులసులతో శ్రీరామచంద్రునికి అర్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంత్రోచ్చరణల మధ్య ప్రారంభమైన అర్చన కార్యక్రమం మధ్యాహ్నం వరకు భక్తుల శ్రీరామనామ జపం మధ్య కొనసాగింది. దేవస్థానం ఛైర్మన్ అయితా శ్రీధర్, కార్య నిర్వహణ అధికారి కె.మమత భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే సంజీవయ్య లక్ష తులసీ అర్చన కార్యక్రమానికి హాజరై ప్రత్యేక పూ జలు చేశారు. చిన్ని శ్రీనివాసులు, సుప్రజ దంప తులు,వాకిచర్ల వెంకటేశ్వర్లు, సుధారాణి, జయంతి నాగేశ్వరరావు,లక్ష్మి ఉభయకర్తలుగా వ్యవహరించారు.

# అంతారామమయం..!



## గూడూరులో మిన్నంటిన సంబరాలు

గూడూరు, జనవరి 22, ప్రభాతవార్త

అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా గూడూరులో పలు దేవాలయాల్లో విశేషాలంకరణ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గూడూరు శ్రీప్రసన్నవెంకటేశ్వర స్వామి దేవస్థానంలో లక్ష తులసి పూజ అలాగే గమల్లపాలెంలో ఉన్న శ్రీ పాండురంగ స్వామి దేవస్థానం వద్ద స్వామి వారి శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. మంగళవాయిద్యాలు మహిళల కోలాటాలు ప్రత్యేకఆకర్షణగానిలిచాయి.మహిళలుదీపాలనువెలిగించిపూజలు నిర్వహించారు. రాజా వీధిలోని వ్యాపారస్తులు రాములవారి భక్తిగీతాలను ఆలపిస్తూ,డాన్సులు చేస్తూ ఉత్సాహంగా ప్రదర్శన నిర్వహించారు. బాలాజీ నగర్ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవ స్థానం వద్ద పూలతో విశేషాలంకరణ ఏర్పాటు చేశారు. చిన్నకుమార్ వీధివద్ద ఉన్న విజ్ఞేశ్వరస్వామి దేవస్థానం వద్ద భజనలు నిర్వ హించారు.గాంధిబొమ్మవద్దగూడూరు చాంబర్‌ఆఫ్‌కామర్స్ ఆధ్వర్యం లో ప్రసాద వితరణ నిర్వహించారు. రాజా వీధిలోని రామమందిరం వద్ద వ్యాపారులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

**వెంకటగిరిలో...**

**వెంకటగిరి:** అయోధ్యలోబాలరాముడి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా వెంకటగిరి పట్టణంలోని పలురామాలయాల్లో ఘనంగాపూజలు నిర్వహించారు.శ్రీరాముడు, ఆంజనేయ స్వామివేషధారణలతో శోభా యాత్రలను నిర్వహించారు. కర్ణకమ్మవీధి నుండిశోభాయాత్ర నిర్వహించారు. సీనియర్‌వైసిపినేత కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**బాలాయపల్లెలో...**

**బాలాయపల్లి :** అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ట సందర్భంగా శ్రీకోదండరామస్వామి దేవస్థానంలో శాస్త్రోక్తంగా అభిషేకాలు, విశేష పూజలు, హోమాలు నిర్వహించారు.



అంబలపూడిజయంపు,వెంగమాంబాపురం,నిడి గల్లు, గాజులపల్లి, బాలాయపల్లి తదితర గ్రామాలలో అన్నదాన కార్యక్రమాలు ఆలయ నిర్వాహకులు నిర్వహించారు.

**చిల్లకూరులో...**

**చిల్లకూరులో :** వరగలి క్రాస్‌రోడ్డు వద్ద సోమవారం లారీఓనర్స్, బ్రోకర్స్ అసో సియేషన్‌సభ్యులుఅయోధ్యలోబాలరాముడి విగ్రహ ప్రతిష్టను పురస్కరించుకుని బిజెపి నాయకులతో కలిసి శ్రీరామచంద్ర మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి పూజలు నిర్వహించారు.అలాగే పోటుపాలెం బైపాస్ సర్కిల్‌లో కూడా ఘనంగా అన్నదానం కార్యక్రమంనిర్వహించారు.తిక్కవరంలోసీతారామలక్ష్మణ విగ్రహాలతో గ్రామోత్సవంనిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి గూడూరు నియోజకవర్గ ఇన్చార్జి పాపారెడ్డి పురుషోత్తం రెడ్డి, మల్లికార్జున్, సత్యనారాయణ, శంకర, మురళినాయుడు,ప్రకాష్‌నాయుడు, చంద్రారెడ్డి,గిరి,ప్రసాద్,భక్తులుపాల్గొన్నారు.

**సూళ్ళూరుపేటలో...**

**సూళ్లూరుపేట :** అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ట సందర్భంగా సోమవారంసూళ్లూరుపేటలోవాడవాడలాజైశ్రీరామ్ నామస్మరణతో మార్మోగింది. స్థానికబజారుసెంటర్లో మాజీసర్పంచ్ తన్నీరు శేషగిరిరావు ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు.అలాగే పట్టణంలోని పలుదేవస్థానాల్లో స్వచ్ఛంధ సంస్థలు, విశ్వహిందూ పరిషత్‌తో పాటు పలువురు శ్రీరామ భక్తులు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

**కోటలో...**

**కోట :** అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా సోమవారం కోట లోని ఆంజనేయస్వామి ఆలయంలో



ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఉత్సవ మూర్తులను మేళతాళాలతో శోభాయాత్ర కొనసాగించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

**నాయుడుపేటలో...**

**నాయుడుపేట:**

అయోధ్యలో బాలరాముని ప్రతిష్ఠ నేపథ్యంలో సోమవారం నాయుడుపేట పట్టణంలోని రామమందిరాల్లో సీతారాముల కల్యాణం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో ఉన్న రామమందిరంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అయోధ్యలో జరిగే శ్రీరామ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని భక్తులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించే ఏర్పాట్లు చేశారు. అలాగే సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు తులాబందు సుబ్రహ్మణ్యం, ఆర్యవైశ్య సంఘం నాయకులు మల్లికార్జున్, కిషోర్, మెంటా రామ్మోహన్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు ఉదయ్‌శంకర్, బ్రాహ్మణ సంఘం నాయకులు అవధానం సుధీర్, సతీష్‌శర్మ పాల్గొన్నారు.

**వాకాడులో...**

**వాకాడు:**

అయోధ్యలోని బాల రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్టను పురస్కరించుకుని వాకాడు మండలం బాలిరెడ్డిపాళెంలోని శ్రీపట్టాభిరామ రామాలమంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పుర వీధుల్లో శోభాయాత్ర జై శ్రీరామ అంటూ నామస్మరణలతో మారుమోగింది. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త కొడవలూరు దామోధర్ రెడ్డి మాట్లాడుతూ హైందవ ధర్మంలో అందురు ఏంతో ఉన్నంతా ఆరాధించి రామ చంద్రుని ప్రాణ ప్రతిష్ట సందర్భంగా తమ గ్రామంలో శ్రీపట్టాభిరామాయంలో జరగడం ఏంతో అదృష్టంగా భావిస్తునాన్ని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు దీవిఅనంతబాబు, సుబాషిణి, వేంబేటి మస్తానయ్య, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## బిసిల ద్రోహి జగన్

### : పాశం సునీల్‌కుమార్ ఆరోపణ

కోట, జనవరి 22 ప్రభాతవార్త



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బిసిల ద్రోహిగా చరిత్రలో నిలిచిపోయారని గూడూరు మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక షాదీమంజిల్‌లో జయహో బిసిసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సమాజంలో పేద, మధ్యతరగతి ప్రజల అభ్యున్నతికి తెలుగుదేశం పార్టీ తొలి నుంచి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. వైసీపీ పాలనలో బిసిలు అన్ని విధాలుగా నష్టపోయారని ఆరోపించారు.రానున్న ఎన్నికల్లో బిసిలంతా ఏకతా టిపైకి వచ్చి టిడిపికి మద్దతు పలకాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా బిసిసెల్ జనరల్ సెక్రటరి తీగల సురేష్‌బాబు, మాజీ మండల అధ్యక్షుడు బాలకృష్ణ యాదవ్, జిల్లా బిసిసెల్ అధ్యక్షుడు సదాశివం, రాష్ట్ర కార్యదర్శి గుండాల లీలావతమ్మ, రాష్ట్ర కార్యదర్శి మునుస్వామి,గూడూరు నియోజకవర్గ అధికార ప్రతినిధి తిరుమలశెట్టి కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి కోటేశ్వరరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింధూజ, టిఎన్‌డి నాయకులు చెంగల్‌రావు, వాకాడు మాజీ జడ్పిటిసి ప్రమీల, వెంకన్నపాలెం సర్పంచ్ మధుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**చంద్రన్న కార్మిక చైతన్య బస్సు యాత్ర పోస్టర్ ఆవిష్కరణ**

షాదీమంజిల్‌లో పాశం సునీల్‌కుమార్ కార్మిక చైతన్య బస్సుయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. వైసీపీ ప్రభుత్వంలో కార్మికులకు జరిగిన నష్టాలను ప్రజలు, కార్మికులకు వివరించి వారిని చైతన్యపరిచేందుకు టెక్కలి నుంచి కుప్పంవరకు యాత్ర విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## నా వల్ల ఇబ్బందులుంటే క్షమించండి

### - రానున్న ఎన్నికల్లో అందరిని కలుపుకొని విజయం సాధిస్తాం

### - అసమ్మతి నేతలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే సంజీవయ్య

నాయుడుపేట, జనవరి 22 ప్రభాతవార్త



నియోజకవర్గంలోని అసమ్మతి నాయకులకు తనవల్ల ఏమైనా ఇబ్బందులు కలిగి ఉంటే క్షమించాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. స్థానికఆర్‌అండ్‌బి అతిథిగృహంలో ఎన్‌బిసిసిబి ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయ ణరెడ్డి, పార్టీ నాయకులతో కలిసి సామాజిక సాధికార బస్సు యాత్ర విజయ వంతం కావడంపై విలేకరుల సమావేశంనిర్వహించారు. ఆయనమాట్లాడుతూ వైసీపీనాయకులందరూ ఒకే కుటుంబమని, రాబోయే ఎన్ని కల్లో అందరినీ కలుపుకొని సూళ్లూరుపేట నియోజకవర్గంలో విజయం సాధి స్తామని చెప్పారు. ఎన్‌డిసిసిబి ఛైర్మన్‌కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే కిలి వేటి సంజీవయ్యను మరోమారుఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించడం సంతోషకరమ న్నారు. పార్టీలోని నాయకులందరినీ కలుపుకొని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి సూళ్లూరుపేట నియోజకవర్గాన్ని అడ్డాగా మారుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట ఎఎంసి ఛైర్మన్ తంబిరెడ్డి జనార్ధన్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ కటకం దీపిక,వైసీపీ మండల అధ్యక్షుడు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, కామిరెడ్డి రాజారెడ్డి, వైసీపీ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు కటకం జయరామయ్య, ఓజిలి మండల అధ్యక్షులుహరినాథ్‌రెడ్డి, నాయకులు బైనా మల్లికార్జునరెడ్డి, అన్నమేటి చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## బస్సుఢీకొని చిన్నారి మృతి

శ్రీకాళహస్తిరూరల్,జనవరి 22 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మండలం మర్రిమాకుల కండ్రిగలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మూడేళ్ళ చిన్నారి మృతి చెందినట్లు సమాచారం అందింది. వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాళహస్తిలోని ఓ ప్రైవేటు పాఠశాలకు సంబంధించిన బస్సు ఎంఎంసి కండ్రిగకు చెందిన విద్యార్థులను వదలిపెట్టి బస్సు తిరిగి వస్తుండగా దేవాన్ష్(3) ఆడుకుంటూ బస్సు కింద పడినట్లు సమాచారం. ఈ సంఘటనతో గ్రామంలో విషాదం చోటు చేసుకుంది.

## మారథాన్ పోటీల్లో ఎస్ఐ రామకృష్ణ ప్రతిభ

### -మొదటి నుంచి రన్నింగ్‌పై ఆసక్తి



శ్రీకాళహస్తి, జనవరి 22 ప్రభాతవార్త: తొట్టంబేడు, శ్రీకాళహస్తి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా సమర్థవంతంగా పనిచేసి ప్రస్తుతం చిత్తూరులోని పోలీసు శిక్షణ కేంద్రంలో ఎస్ఐగా పనిచేస్తున్న వి.రామకృష్ణ ఆదివారం టాటా ముంబై మారథాన్ పోటీల్లో పూర్తి స్థాయి మారథాన్‌లో 42కిలో మీటర్ల 200మీటర్లు దూరాన్ని 3గంటల 31నిమిషాల 30సెకండ్లలో పూర్తిచేశారు. గత ఏడాది ఇదే మారథాన్ పోటీల్లో 4గంటల 19 నిమిషాల 51 సెకండ్లలో పూర్తిచేశారు. గత ఏడాది కంటే ఈ ఏడాది 48 నిమిషాల 21 సెండ్ల సమయాన్ని తగ్గించారు. ఈయన తన కలల మారథాన్ అయిన బోస్టన్ యుఎస్ఏ మారథాన్ పోటీల్లో పాల్గొనాలంటే 3గంటల లోపు 42.200మీటర్ల దూరాన్ని పూర్తి చేయాల్సి ఉంది. ఆది నుంచి ఆయన ప్రతిరోజు రన్నింగ్ చేయడం గమనించదగ్గ విషయం. ఈసందర్బంగా టాటా ముంబై పోటీల్లో పాల్గొన్న ఆయన్ను పలువురు పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది అభినందించారు.

## లారీ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

తొట్టంబేడు, జనవరి 22 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి, తొట్టంబేడు తాలూకా లారీ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారులుగా కె.సుబ్రమణ్యం, గౌరవా ధ్యక్షులుగా పి.గురవారెడ్డి, అధ్యక్షులుడా పి.జయశంకర్, ఉపాధ్యక్షుడుగా సి.దేవిశ్రీ ప్రసాద్, కార్యదర్శిగా ఎ.సాయిరెడ్డి సంయుక్త కార్యదర్శులుగా ఎ.సుబ్రమణ్యం ఆచారి, ఎస్.మాబూఖాన్, ట్రెజరర్‌గా పి.యుగంధర్‌రెడ్డి, సంయుక్త ట్రెజరర్‌గా టి.గోపి, కమిటీ సభ్యులుగా పి.రమేష్‌రెడ్డి, ఎన్.మురళీ మోహన్‌రెడ్డి, ఎ.మునిశేఖర్, ఎ.మస్తాన్‌రెడ్డి, ఎన్.ఆదెయ్య, కె.మునస్వామిరెడ్డి, ఎస్.బాలయ్య, ఎస్.షాకిర్‌బాషా, ఎం.శంకర్‌యాదవ్, ఆర్.కుమార్, ఈ.వెంకటాచలపతిరెడ్డి, వి.సంజీవ రెడ్డి, సి.జగదీష్‌రెడ్డి, టి.హరియాదవ్ లను ఎన్నుకున్నారు.

## శ్రీదేవిభూదేవి సమేత వెంకటేశ్వర ఆలయాన్ని అభివృద్ధి చేయండి



శ్రీకాళహస్తిరూరల్, జనవరి 22 ప్రభాతవార్త : తొండమాన్‌పురంలో శ్రీదేవిభూదేవి సమేత వెంకటేశ్వర ఆలయాన్ని అభివృద్ది చేయాలని కోరుతూ తిరుమల తిరుపతి జాయింగ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ తొండమాన్‌పురం గ్రామ ప్రజలు వినతిపత్రాన్ని అందించారు. ఈసందర్బంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ తొండమాన్‌పురంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయం ఉందని 2008లో భూమన కరుణాకర్‌రెడ్డి ఛైర్మన్‌గా ఉన్న సమయంలో టిటిడిలో విలీనం చేసుకుని అభివృద్ధి చేశారన్నారు. 2016వ సంవత్సరంలో ఆలయం పునఃనిర్మాణం జరిగి కుంభాభిషేకం జరిగిందని ప్రస్తుతం దినదినాభివృద్ది చెందిందన్నారు. గతంలో కొంత వరకు మాత్రమే అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. ఇప్పుడు గ్రామంలోని ఆలయ అభివృద్దికి తోడ్పడాల్సిందిగా కోరారు. బ్రహ్మోత్సవాల సమయంలో కోనేరు సౌకర్యం లేదని కోనేరు నిర్మించాలని, ఆలయానికి వెళ్ళేరోడ్డును విస్తరణ చేయాలని, కళ్యాణవేదిక ఏర్పాటు చేసి స్వామివారి నిత్యకళ్యాణం జరిగే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. పూర్తయిన కళ్యాణకట్టను త్వరితగతిన ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని, ఆంధ్రప్రదేశ్ టూరిజం వారి వద్ద నుంచి టిటిడి అతిథిగృహాలను ఆధునీకీకరణ చేసి వాడుకలోకి తీసుకురావడానికి చర్యలుతీసుకోవాలన్నారు. ఆలయానికి సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసే భక్తులు బాత్‌రూంలు నిర్మాణం కోసం చర్యలుతీసుకోవాలని ఆలయాన్ని కపిలతీర్థం గ్రూప్ టెంపుల్స్ నుంచి తిరుచానూరు గ్రూప్ టెంపుల్స్‌కు మార్చడం కోసం చర్యలుతీసుకోవాలని కోరారు.

## అర్బన్ సిఐగా నరసింహరావు

శ్రీకాళహస్తి, జనవరి 22 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పట్టణ అర్బన్ సిఐగా అనంతపురంరేంజి విఆర్‌లో ఉన్న ఎస్‌వి.నరసింహారావును నియమించారు. కాగా ఏర్పేడు సిఐగా శ్రీరామ శ్రీనివాసులును నియమిస్తూ అనంతపురం రేంజి డిఐజి ఎఎన్.అమ్మిరెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. ఇక్కడ సిఐగా పనిచేస్తున్న అంజూయాదవ్‌ను ట్రాఫిక్‌కు బదిలీచేశారు. సిఐ విక్రమ్‌ను అనంతపురంకు బదిలీచేసినట్లు సమాచారం. ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికారులు బదిలీలకు రంగం సిద్దం చేశారు. ఇక ఎస్ఐలను బదిలీలు చేయాల్సి ఉంది.

## జైశ్రీరామ్ నినాదంతో...భక్తులకు ప్రసాద వితరణ



తిరుపతి,జనవరి 22ప్రభాతవార్త: అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవం శుభసమయంలో సోమవారం ఉదయం రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో జైశ్రీరామ్ నినాదాలు చేశారు. పెద్దకాపు వీధిలోని భజన మందిరంలో అయోధ్యరామాలయం ప్రారంభశుభవేళ ప్రత్యక్షకార్యక్రమాన్ని వీక్షించి రాయల సీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి, కళాకారులు భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

## రేపు మెగా వైద్య శిబిరం

పుత్తూరు, జనవరి 22 ప్రభాతవార్త : ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన పట్టణంలో ఉదయం 9.00 గంటలకు ఆర్టీసి బస్టాండ్ వద్ద ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు రవిరాజు తెలిపారు. ఆస్టర్ నారాయణాద్రి, వాసన్ ఐ కేర్ తదితర ఆస్పత్రుల ఆధ్వర్యంలో ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తామన్నారు. రిపబ్లిక్ డే సందర్భంగా నిర్వహించే రక్తదాన శిబిరంలో యువకులు పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.

## భక్తులకు అన్నదానం



శ్రీకాళహస్తి,జనవరి 22 ప్రభాతవార్త : శ్రీకాళహస్తిలో సోమవారం వాడ వాడల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అయోధ్యలో అభిజిత్ లగ్నంలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ట సందర్భంగా పుణ్యక్షేత్రంలో అన్నదానాలు నిర్వహించారు. కైలాస్ గ్రాండ్ భాగస్తులు రామ కృష్ణారెడ్డి, హరిలు పట్టణంలోని బిక్షాల గాలిగోపురం, అగ్రహారంలోని శ్రీరామమందిరం వద్ద వేలాది మందికి భోజన వసతి కల్పించారు. శ్రీకాళహస్తిలో సోమవారం ఆయోధ్యలో జరిగిన శ్రీరామచంద్రుని విగ్రహ ప్రతిష్ట సందర్భంగా పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలో వాడ వాడల్లో అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ నేపథ్యంలో సన్నిధివీధిలో పూల వ్యాపారి చిన్నబ్బ సారధ్యంలో అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా మాజీ మున్సిపల్ ఛైర్మెన్ ముత్యాల పార్థసారథి హాజరై అన్నదానం జరిపారు.

## వీధులపేర్లు ఖరారు



శ్రీకాళహస్తి,జనవరి 22 ప్రభాతవార్త : శ్రీకాళహస్తిలోని శ్రీరామనగర్ కాలనీ అతి పురాతనమైనది. ఇది పానగల్‌ను పరిపాలించిన రాజులచే విక్రయించబడిన నగర్. ఏ వీధి వాళ్ళు ఆ వీధికి పేర్లు పెట్టుకుంటున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం పానగల్‌లోని శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటికి ఎదురుగా ఉన్న రెండు లేన్లకు పేర్లు ఖరారు చేసారు. ఈనేపధ్యంలో ఓ లేన్‌కు గణపతివీధిగా మరొక వీధికి, హనుమాన్ వీధిగా నామకరణం చేసారు. బోర్డులు ఏర్పాటు చేసారు. వినాయక వీధి బోర్డుకు మహిళలు భారీ ఎత్తున పూజలు జరిపారు.

## కాపుసేన అధ్యక్షుడుగా నవీన్‌కుమార్



శ్రీకాళహస్తి,జనవరి 22 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పట్టణ కాపుసంక్షేమ సేన పట్టణ అధ్యక్షుడుగా పసుపులేటి నవీన్ కుమార్‌ను నియమిస్తూ నియామక పత్రాన్ని నియోజకవర్గ అధ్యక్షులు అరిగల వేణుగోపాల్ నాయుడు అందించారు. శ్రీకాళహస్తి లో కాపు సేన దిన దినాభివృద్దికి దశల వారిగా కార్యక్రమాలను రూపొందించి అమలు చేస్తున్నారు. ఈ నేపధ్యంలో యువకుడైన నవీన్‌కుమార్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమాల్లో రాధారంగా మిత్రమండలి అధ్యక్షులు సిద్దులుగారి ప్రసాద్,ప్రాధాన కార్యదర్శి మోహన్‌రావు, పగడాల ప్రతాప్, శ్రీపురం సుధా,రాజేష్,కలవకోలు వరప్రసాద్, కంటా సుబ్రమణ్యం, రమణగారి అనిల్,మునిరమణ,హేమకుమార్, మునిరాజ,మునిశేఖర్‌లు పాల్గొన్నారు.

## సినీ నిఘంటువు అక్కినేని :ఆర్కాట్ కృష్ణప్రసాద్



తిరుపతి టౌన్, జనవరి 22 ప్రభాతవార్త: తిరుపతిలోని అక్కినేని అభిమానసంఘం ఆధ్వర్యంలో అక్కినేని నాగేశ్వర రావు 10వవర్ధంతిసందర్భంగాతిరుపతి రైల్వే స్టేషన్ సమీపంలో అక్కినేని చిత్రపటానికి పూలమాల వేసి కొబ్బరికాయలు కొట్టి నివాళులర్పించారు. అనంతరం 200 మంది పేదలకు అన్నదానం చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు, అక్కినేని అభిమాని ఆర్కాట్ కృష్ణప్రసాద్, కార్యదర్శి జగన్నా థం విచ్చేసారు. ఈ సందర్భంగా ఆర్కాట్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ సినీ ప్రపంచంలోఅక్కినేని నాగేశ్వరరావు ఒక నిఘంటువు అనికొనియాడారు. ఈ కార్యక్రమంలో అక్కినేని అభిమాన సంఘం నాయకులు గోపినాథ్, వేణు, బాలరాజు, ప్రసాద్,గోపి,శ్రీనివాసులు, చంద్ర, గౌరి, కుమార్, మునికృష్ణారెడ్డి, రామమూర్తి, బాబు, కేశవ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## రుయా పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : ఏఐటియుసి

తిరుపతి టౌన్, జనవరి 22 ప్రభాతవార్త : రుయా హాస్పిటల్‌లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు తమ సమస్యలు పరిష్క రించాలని రెగ్యులర్‌గా జీతాలు ఇవ్వాలని, పనిభారం తగ్గించాలని అనేక సార్లు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించినా ఫలితం లేదు అని ఏఐటియుసి నాయకులు తెలిపారు. సోమవారం సూపరింటెండెంట్‌ను ఏఐటియుసి నగర ప్రధాన కార్యదర్శి ఎన్‌డి రవి కార్మికులతో కలిసి సూపరింటెండెంట్‌కు వినతి పత్రాన్నిసమర్పించారు. వారు మాట్లాడుతూ సూపరిం టెండెంట్ స్పందించి సమస్యలు పరిష్కరించకుంటే ఈ నెల 24,25 తేదీల్లో గంట పాటు సూపరింటెండెంట్ ఆఫీస్ ముందు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని 25తర్వాత సమస్యలు పరిష్కారంకాని పక్షంలో ఖచ్చితంగా సమ్మెలోకి వెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి మహేంద్ర, రుయా ఆసుపత్రి పారిశుద్ధ్య కార్మికులు పార్వతి, జ్యోతి, లత, రమణమ్మ, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## పాలమంగళంలో సీతారాముల ఊరేగింపు



నారాయణవనం, జనవరి 22 ప్రభాతవార్త : సోమవారం ఆయోధ్యలో బాలరాముని ప్రాణప్రతిష్ట కార్యక్రమంను పురస్క రించుకొని పాలమంగళం ఉత్తరపుకండ్రిగలో వెలసిన సీతారాముల సమేత లక్ష్మణుడు గ్రామ పుర వీధుల్లో భక్తులకు దర్శనంఇచ్చారు. భక్తులు రామ జపంతో స్వామి అమ్మవారికి టెంకాయ హారతులు పట్టారు. భక్తులకు ప్రసాదాలను అందజే శారు. అలాగే మండల పరిధి లోని సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాలలో ఛైర్మన్ కె అశోకరాజు రాముల వారి చిత్రపటానికి పూలమాలలు వేసిహారతులు పట్టారు. ఈ కార్యక్రమ ంలో ప్రిన్సిపాల్స్ చంద్రశేఖర్‌రెడ్డి, జనార్ధన్‌రాజు, రమేష్,అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మినీ అయోధ్యగా గాజులమండ్యం



రేణిగుంట, జనవరి 22 ప్రభాతవార్త: రామనామం, రామభజనలతోమండలపరిధిలోని గాజులమండ్యం సోమవారం మరో అయోధ్యను తలపించింది. అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్టను పురస్కరించుకుని గాజులమండ్యం శ్రీ కామాక్షి సమేత మూల స్థానేశ్వర ఆలయంలోశ్రీరామచంద్రమూర్తికి విశేషపూజలు జరిగాయి. 105 సంవత్సరాల చరిత్ర కలిగిన కలంకారి రామపట్టాభిషేకం చిత్రపటాన్ని పల్లకిలో ఊరేగిస్తూ నగర సంకీర్తన చేశారు. తిరుపతి ఇస్కాన్ బృందం ఊరేగింపులో పాల్గొన్నారు. దేవాలయ కల్యాణ మండపంలో ఆలయ నిర్వాహకుడు జువ్వల ధనంజయరెడ్డి అయోధ్యలో జరిగే కార్యక్రమాలను వీక్షించడానికి లైవ్ టీవీని ఏర్పాటు చేశారు. అర్చకులు దక్షిణామూర్తి,పండితుడు చంద్రాచారి ప్రత్యేక అర్చనలు చేశారు. ఆలయ నిర్వాహకుడు జువ్వల ధనంజయరెడ్డి, జగదీష్‌రెడ్డి, ఇందు కుమార్‌రెడ్డి, దినకర్‌రెడ్డి, వేద కిషన్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలోగాజులమండ్యం సర్పంచ్, వైసీపీ మండల కన్వీనర్ డా. గంగారి రమేష్, బీజేపీ జిల్లా నాయకులు చంద్రారెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు బొబ్బిలిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

## జగనన్న సునామీని ఎవరూ అడ్డుకోలేదు - పవిత్రరెడ్డి

రేణిగుంట, జనవరి 21 ప్రభాతవార్త: జగనన్న ఉన్న ప్రజాబలంసునామీ లాంటిదని సునామీని ఎవరు అడ్డుకోలేరని వైసీపీ మండలఇన్‌చార్జి పవిత్రరెడ్డి అన్నారు. రేణిగుంటషాదిమహల్‌లో సోమ వారం ఓ ప్రైవేటుకార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈసందర్బంగా ఆమె మాట్లాడుతూ జగన్ వెనుక సునామీలాగా ప్రజాబలం ఉందన్నారు. ఆయన గెలుపునుఅడ్డుకోవడంఎవరికి సాధ్యంకాదన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నాగేషం, ముస్లిం మైనారిటీ వైసీపీ మండల అధ్యక్షుడు అబ్దుల్‌ఖాదిర్, ముస్లిం మైనారిటీ వైసీపీ పట్టణ అధ్యక్షుడు రఫీ ఉల్లా, కో-ఆప్షన్ సభ్యులు అసన్, ఆషారాజు,సైకిల్‌షాపు అలీలు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలపై ప్రభుత్వ వైఖరి మార్చుకోవాలి

రేణిగుంట, జనవరి 21 ప్రభాతవార్త:అంగన్‌వాడీ వర్కర్లు,హెల్పర్లపై ప్రభుత్వంతన వైఖరిని మార్చుకోవాలని కార్మిక సంఘాలు డిమాండ్‌చేశాయి. ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాన్ని వ్యతిరేకిస్తూ రేణిగుంట అంబేడ్కర్ విగ్రహం వద్ద కార్మిక సంఘాలు సోమవారం నిరసన వ్యక్తం చేశాయి. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నరసింహారెడ్డి, రాజశేఖర్, కేవీపీఎస్ నాయకుడు సెల్వరాజు, ఐద్వానాయకురాలు సత్యశ్రీ, సుజాతమ్మ, ఎర్రస్వామి, దీప, దిలీప్, బాషా, రమణ, తారకరామానగర్ వాసులు పాల్గొన్నారు.

## వైభవంగా రాముల వారి కల్యాణం



వడమాలపేట, జనవరి 22 ప్రభాతవార్త: అయోధ్య లో శ్రీరామచంద్రుని విగ్రహప్రతిష్టను పురస్కరించుకుని వడమాలపేట లోని సంజీవరాయ ఆలయంలో సోమవారం సీతారాముల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. సీతారాములఉత్సవ మూర్తులకు అభిషేకం నిర్వహించారు. వేదపండితులు శివ, సాయిల వేదమంత్రాలు పఠించగా మేళ తాళాలు, భక్తుల శ్రీరామ నామాల నడుమ మాంగళ్య ధారణ చేయించారు. అనంతరం వడమాలపేటలో ఊరే గించారు. భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం వడమాలపేట కన్యకా పరమే శ్వరిఆలయంఆధ్వర్యంలో, తిరుమణ్యం, రాజులకండ్రిగ, ఎస్‌బీఆర్ పురం తదితర గ్రామాల్లో సీతారాముల ఊరేగింపు నిర్వహించారు.

## అంతా రామమయం



ఏర్పేడు, జనవరి22 ప్రభాతవార్త; మండలంలోని అన్ని గ్రామాల్లో రామాలయాలను పచ్చటి పందిళ్లు, మామిడి, పూలమాల తోరణాలతో ముస్తాబు చేశారు. హరేరామ భజనలు చేశారు. ప్రజలు ఉదయాన్నే రామాలయాలను సందర్శించారు. అదేవిధంగా ఇంటింటా దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. దేవాలయాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. యండి పుత్తూరు గ్రామంలో అయోధ్య రామమందిర దివ్యాక్షింతలను సర్పంచి మోహన ప్రియ ఇంటింటికి తిరిగి పంపిణి చేశారు. అదేవిధంగా అంజిమేడు, ఇసుకతాగేలి,ఏర్పేడు, పాపానాయుడుపేట గ్రామాల్లో దేవాలయ ఆవరణల్లో భక్తిభావ ఉపన్యాసాలు,పాటకచ్చేరీలు నిర్వహించారు.

తిరుచానూరులో ఘనంగా రామవిగ్రహ ప్రతిష్ట సంబరాలు

## వేలాది భక్తులకు అన్నదానం



తిరుచానూరు, జనవరి 22 ప్రభాతవార్త : తిరుచానూరులో రామభక్తులు ఘనంగా సంబరాలు నిర్వహించారు. అయోధ్య రామ మందిరంలో విగ్రహ ప్రాణ ప్రతిష్ట సందర్భంగా దేశ వ్యాప్తంగా రామ భక్తులు భక్తిశ్రద్ధలతో సంబరాలు నిర్వహించారు. అనంతరం సర్పంచ్ రామచంద్రారెడ్డి సుమారు ఐదు వేల మంది భక్తులకు అన్నప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నేతలు, కార్యకర్తలు, ఆర్ఆర్ యువత పాల్గొన్నారు.

## దేశంలో చేరిన వైకాపా మద్దతుదారులు



శ్రీకాళహస్తి,జనవరి 22 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఇటీవల ఆయారాం గయారాంల కార్యక్రమా లు పెచ్చు పెరుగుతున్నాయి. ఆ పార్టీలో నుంచి ఈ పార్టీలోకి ఈ పార్టీలోంచి ఆ పార్టీలోకి రాకపోకలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మర్రిమంద పంచాయతీకి చెందిన పలువురు సోమవారం తెలుగుదేశం పార్టీకి చెందిన ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి స్వగ్రామం అయిన ఊరందూరులో కలసి తాము పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. దాంతో సుధీర్‌రెడ్డి వారికి కండువా కప్పి స్వాగతించారు. గత ఎన్నికల్లో ఈ గ్రామంలో వైకాపా క్లీన్ స్వీప్ చేసింది. అయితే ప్రస్తుతం మార్పుచోటు చేసుకుంది. తెలుగుదేశం పార్టీలో చేరిన వారిలో షేక్ జాఫర్, మునిరత్నం, ధన, కళ్యాణ్‌కుమార్, శ్రీకాంత్, హరి, తిల్లిప్రసాద్, షమీనా, యువరాణి, జాఫర్,మురుగప్ప, కృష్ణప్ప, రోశయ్య, కందప్ప, శ్రీనివాసులు, హేమంత్, మంజునాథ, మునీంద్ర, కామరాజు, వసంత, హరి తదితరుల సారధ్యంలో గ్రామానికి చెందిన 72 కుటుంబాలు చేరినట్లు ప్రకటించారు.

## పోలింగ్ కేంద్రాల వద్ద జాబితా పరిశీలించుకోవచ్చు

నగరి, జనవరి 22 ప్రభాతవార్త: పోలింగ్‌కేంద్రాల వద్ద ఓటర్ల జాబితాను పరిశీలించుకోవచ్చుని ఆర్డీవో సృజన అన్నారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఓటర్ల జాబితాను విడుదల చేశారు. ప్రస్తుత ఎన్నికల్లో పురుషులు 98081, మహిళలు 103358, థర్డ్ జండర్ 8 మంది అంటూ మొత్తం 201447 మంది ఓటర్లు ఉన్నారన్నారు. తుది ఓటర్ల జాబతా అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచామన్నారు.

## శ్రీరామ చిత్రపటాలతో ర్యాలీలు



నగరి, జనవరి 22 ప్రభాతవార్త: అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ట సందర్భంగా వాడవాడలా ఆలయాల్లోను, ఇళ్ళలోను పూజలు, భజనలు జరిగాయి. అయోధ్య రాముడు అందరికి బంధువయ్యాడు. సోమవారం ప్రాణ ప్రతిష్ట జరిగే సమయానికి మహిళలు ఇళ్ళ వద్ద దీపాలు పెట్టి పూజలు చేశారు. ఇంటి ముందు రామబాణాల ముగ్గులు వేసి రామునికి స్వాగతం పలికారు. రామాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. నగరి బ్రాహ్మణ సంఘం వారు కరియమాణిక్యస్వామి ఆలయం నుంచి శ్రీరాముని చిత్రపటంతో రామభజనలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఆద్యంతం కోలాటాలు, జై శ్రీరాం నినాదాల నడుమ ర్యాలీ కొనసాగింది.

## వాడవాడలా రామభజనలు, పూజలు

పుత్తూరురూరల్, జనవరి 22 ప్రభాతవార్త: అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ట సందర్భంగా వాడవాడలా ఆలయాల్లోను ఇళ్ళలోను పూజలు, భజనలు జరిగాయి. మహిళలు ఇళ్ళ వద్ద దీపాలు పెట్టి పూజలు చేశారు. కాపు వీధిలోని శ్రీ కోదండరామస్వామి ఆలయంలో(నోములగుడి) మధ్యాహ్నం అన్నదానం , రాత్రి ప్రత్యేక ఊరేగింపు నిర్వహించారు. వేపగుంట తిరుమలకుప్పం, అలాగే దేవాలయాల్లో కూడా ప్రత్యేక పూజలు భజనలు చేసి ప్రసాదాలు వితరణ చేశారు. కల్యాణపురంలో శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయంలో శ్రీరామపూజలు చేసి భక్తులకు ప్రసాదాలు అందించారు.

పీటీఆర్‌రూరల్1: వేపగుంటలో రామాలయం దేవాలయం వద్ద పూజలు

## అంగన్వాడీలను అదుపుచేయండి

### -సత్యవేడు మండలమీట్‌లో సర్పంచ్ ఫైర్



సత్యవేడు, జనవరి 22 ప్రభాతవార్త: సత్యవేడు యంపిడివో కార్యాలయంలో సోమవారం యంపిపి ప్రతిమ ఆధ్వర్యంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. పలు ప్రభుత్వశాఖల అధికారులు సమావేశానికి దుమ్మా కొట్టారు. అయితే ఈ సమావేశానికి హాజరైన పలువురు అధికారులు శాఖల వారిగా ప్రగతినివేదికను వివరించారు. ఈ నేపథ్యంలో ఐసిడిఎస్ అధికారిణి దేవకుమారి తమ శాఖ వివరాలను తెలుపుతున్న సందర్భంలో దాసుకుప్పం సర్పంచ్ రవిరెడ్డి ప్రభుత్వం అన్నివిధాలుగా సానుకూలంగా ఉన్నా అంగన్వాడీలు నిరసనలు చేయడం సరికాదన్నారు. వారిపై తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కొత్తమారికుప్పం పంచాయితీలో నాలుగేళ్ళకు ముందు ప్రారంభించిన రోడ్డు ఇప్పటి వరకు నిర్మాణానికి నోచుకోలేదని యంపిటీసి మోహన్‌రెడ్డి సమస్యలను యంపిపికి వివరించారు. అలాగే దాసుకుప్పంలోని ప్రభుత్వ భూముల ఆక్రమణపై చర్యలు చేపట్టాలని కోరారు. ఈసందర్భంగా యంపిపి మాట్లాడుతూ సభ్యుల సమస్యలను పరిష్కరించే విధంగా చూస్తామన్నారు. జడ్పీటీసి విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఈకార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## జగనన్న పాలన చిరస్మరణీయం

చంద్రగిరి, జనవరి 22 ప్రభాతవార్త: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పరిపాలన చిరస్మరణీయమని వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం పాతపేట బజారువీధి, ఇందిరమ్మ కాలనీలలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన గడపగడపకు వెళ్ళి ప్రభుత్వం ప్రతి కుటుంబానికి అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. అదేవిధంగా ప్రతి కుటుంబానికి ఎంఎల్‌ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చేసిన సేవలను గుర్తుంచుకోవాలన్నారు. 2024 ఎన్నికలలో ఎంఎల్‌ఏ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మా అన్నయ్యను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శానంబట్లలో శ్రీరామ భజనలు



చంద్రగిరి, జనవరి 22 ప్రభాతవార్త: అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రాణప్రతిష్టను పురస్కరించుకుని సోమవారం శానంబట్లలో బిజెపి జిల్లా కార్యదర్శి కె.వెంకటముని ఆధ్వర్యంలో గ్రామస్థులు శ్రీరామ భజనలు నిర్వహించారు. గ్రామంలోని భజన మందిరం వద్ద రామభజనలు నిర్వహించడంతో ఊరేగింపుగా భజనలు చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఈశ్వర్, పురుషోత్తం, సుబ్రమణ్యం రెడ్డి, దేవేంద్రరెడ్డి, పావని (చిట్టి), తదితరులు పాల్గొన్నారు.

## బాలరాముని ప్రాణప్రతిష్ట మహాఘట్టం

### రిటైర్డ్ అడిషినల్ ఎస్పీ నంజుండప్ప



రామచంద్రాపురం, జనవరి 22 ప్రభాతవార్త: అయోధ్యలో బాలరాముని ప్రాణప్రతిష్ట ఒక మహాఘట్టమని రిటైర్డ్ అడిషినల్ ఎస్పీ నంజుండప్ప అన్నారు. సోమవారం సి.రామాపురం సమీపంలోని శ్రీబ్రహ్మశ్రీ గురువానంద గురూజీ ఆశ్రమ ప్రాంగణంలో గురూజీ ఆదేశాల మేరకు రామమందిరం ప్రారంభోత్సవ సందర్భంగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రామజన్మ భూమిలో రామాలయాన్ని నిర్మించడం ప్రతి ఒక్క హిందువు యొక్క ఆశయమన్నారు. రామయల నిర్మాణం ఎట్టకేలకు జరగడం, నేడు ప్రాణప్రతిష్ట గావించడం, ప్రారంభోత్సవానికి గురూజీ వెళ్ళడం ఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డిఎస్పీ గంగరాజు, అవిలాల రాజశేఖర్‌రెడ్డి, గంగిరెడ్డి, ఆశ్రమ నిర్వహకులు రామ్‌ప్రకాష్, విజయకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

## దొంగ ఓట్లపై న్యాయ పోరాటం చేస్తా..!

### టిడిపి ఎంఎల్ఏ అభ్యర్థి పులివర్తి నాని



రామచంద్రాపురం, జనవరి 22 ప్రభాతవార్త: ఎంఎల్ఏ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చేస్తున్న దొంగ ఓట్ల నమోదుపై న్యాయపోరాటం చేస్తానని టిడిపి చంద్రగిరి నియోజకవర్గ ఎంఎల్ఏ అభ్యర్థి పులివర్తి నాని అన్నారు. సోమవారం ఆయన దొంగ ఓట్ల నమోదుపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏఆర్‌ఓలు, బిఎల్‌ఓల లాగిన్ల నుండి ఎంఎల్‌ఏకి సంబంధించిన వ్యక్తులు దొంగ ఓట్లు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. 6 మండలాల్లో పరిసర ప్రాంతాలలోని 10 నియోజకవర్గాల నుండి వైసిపి కార్యకర్తలను దొంగ ఓటర్లుగా నమోదు చేయడం జరిగిందన్నారు. దొంగ ఓట్ల నమోదుపై పూర్తి ఆధారాలతో రాష్ట్ర, కేంద్ర ఎన్నికల సంఘాలకు ఫిర్యాదు చేశామన్నారు. చెవిరెడ్డి మరొకసారి ఎంఎల్‌ఏగా గెలిస్తే ఎర్రచందనం, మట్టి, మఠం భూములు, గంజాయి మాఫియాలను మరింత మందిని తయారు చేస్తారన్నారు. పచ్చని రాయలచెరువు పరిసర ప్రాంతాలను రసాయినిక పరిశ్రమలను తీసుకువచ్చి నాశనం చేయాలని చూస్తున్నట్లు ఆరోపించారు. ఈ కార్యక్రమయంలో టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి, నాయకులు జనార్ధన్ చౌదరి, నరశింహారెడ్డి, గిరిధర్ రెడ్డి, ధనంజయ రెడ్డి, సురేంద్ర నాయుడు, మహేష్ నాయుడు, రవి, తదితరులు పాల్గొన్నారు.

## ఉషోదయ వాకర్స్ సంఘం నూతన కార్యవర్గం ఎంపిక

పుత్తూరు, జనవరి 22 ప్రభాతవార్త : పట్టణంలో ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ ఏర్పడి 15 సంవత్సరాలు అయిన సందర్భంగా సోమవారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ వ్యవస్థాపకుడిగా కోనేటి రవిరాజును ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా దొడ్డులూరు బాబు, ప్రధాన కార్యదర్శిగా ఎ.రామ్మోహన్‌వర్మ, కోశాధికారిగా ఇ.లోకనాథంనాయుడులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఫౌండర్ కోనేటి రవిరాజు మాట్లాడుతూ సంఘం స్థాపించిన తర్వాత గత 15 ఏళ్లలో పలు వైద్య శిబిరాలు, విద్యార్థులకు పుస్తకాలు, ఆట వస్తువులు ఉచిత పంపిణీ, వేసవి కాలంలో చలివేంద్రాల ఏర్పాటు, పేదలకు వస్త్రదానం వంటి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించినట్టు వివరించారు. ప్రతి వ్యక్తి రోజుకు 45 నిమిషాలు నడిస్తే ఆరోగ్యంగా వుంటారని తెలిపారు.


**నగరి పురపాలక సంఘము, నగరి**

ఆర్.ఓ.సి.నెం.2555/2024/ఇ1    తేది: 22.01.2024

**ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు**

కమిషనరు నగరి పురపాలక సంఘమునకు సంబంధించి జిజిఎంపి నిధుల నుండి రూ.75.00లక్షలకు గాను 15 పనులకు సంబంధించిన టెండరు తేదీలు ఈ క్రింది విధముగా తెలుపబడినది.

1.బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ చేసుకొనుటకు తేది: 23.01.2024 ఉదయం 11.00గం.లు
2.బిడ్ డాక్యుమెంట్ తీసుకొనుటకు చివర తేది : 29.01.2024, సాయంత్రం 4.00గం.లు
3.బిడ్ డాక్యుమెంట్ సమర్పించుటకు చివర తేది : 29.01.2024 సాయంత్రం 5.00గం.లు
4.బిడ్ ఓపెనింగ్ తేది : 29.01.2024, సాయంత్రం 5.10.గం.లు

తదుపరి వివరములు https://tender.apeprocurement.gov.in ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ నందు చూడవలెను.

ఇట్లు : కె.వెంకట్రామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, నగరి పురపాలక సంఘం

# రెండు కేసుల్లో 10 ఎర్రచందనం దుంగలు స్వాధీనం...ఇద్దరు అరెస్టు

## -గొడ్డళ్లు, రంపాలతో అడవుల్లో చొరబడుతున్న 18 మంది అరెస్టు




తిరుపతి కార్పొరేషన్, జనవరి 22 ప్రభాతవార్త : అన్నమయ్య జిల్లాలో జరిగిన రెండు సంఘటనల్లో 10 ఎర్రచందనం దుంగలను, కారు స్వాధీనం చేసుకుని ఇద్దరు స్మగ్లర్లు, గొడ్డళ్లు, రంపాలతో అడవుల్లోకి చొరబడుతున్న తమిళనాడు రాష్ట్రానికి చెందిన 18 మందికి ఆదివారం టాస్క్‌ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. కర్నూలు రేంజి డిఐజి ఉత్తర్వుల మేరకు టాస్క్‌ఫోర్సు ఎస్పి పి. శ్రీనివాస్ ఆధ్వర్యంలో డిఎస్పి చెంచుబాబుకు చెందిన అన్నమయ్య జిల్లా రాజంపేట ఆర్ఐ చిరంజీవి, ఆర్ఎస్ఐ మురళీధర్ రెడ్డి టీమ్ స్మగ్లింగ్ ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లను తనిఖీ చేసుకుని వెళ్లారు. సుండుపల్లి మండలం సానిపాయి రేంజ్‌లో కుడుమాండ్లపల్లి రోడ్డు పక్కన అనుమానాస్పదంగా నిలిపి ఉన్న కారును చుట్టుముట్టారు. టాస్క్ ఫోర్సు సిబ్బందిని గమనించిన కొందరు పారిపోగా, ఒకడు పట్టుబడ్డాడు. కారులో ఐదు ఎర్రచందనం దుంగలు కనిపించాయి. దీంతో బెంగళూరుకు చెందిన సయ్యద్ నౌషద్ (28)ని అరెస్టు చేసి, ఐదు ఎర్రచందనం దుంగలు, హుండయ్ కారును స్వాధీనం చేసుకున్నారు. మరో కేసులో ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డి విష్ణువర్ధన్ కుమార్ టీమ్ తిరుపతి హెడ్ క్వార్టర్స్ నుండి బయలుదేరి రోళ్లమడుగు, ఏకాసు కుప్పం వైపు కూంబింగ్ చేసుకుంటూ వెళ్లారు. అన్నమయ్య జిల్లా రాజంపేట రేంజి, ఎస్ఆర్ పాలెం సెక్షన్‌లోని పుట్టింగి మడుగు వద్ద కొందరు ఎర్రచందనం దుంగలను మోసుకుని వస్తూ కనిపించారు. వారిని టాస్క్‌ఫోర్సు సిబ్బంది చుట్టుముట్టే ప్రయత్నం చేయగా, దుంగలను పడేసి పారిపోయే ప్రయత్నం చేశారు. అయితే తమిళనాడు తిరువన్నామలై జిల్లాకు చెందిన ఏలుమలై కుప్పు స్వామి (28)ని పట్టుకోగలిగారు. ఆ ప్రాంతంలో ఐదు ఎర్రదచందనం దుంగలు లభించాయి. మరో సంఘటనలో రైల్వే కోడూరు టాస్క్ ఫోర్సు సబ్ కంట్రోల్ కార్యాలయం నుంచి ఆర్ఐ కృపానంద ఆర్ఎస్ఐలు రాఘవేంద్ర,విశ్వనాథ్ నెల్లూరు జిల్లా కలువాయి మండపం వద్దకు చేరుకుని రాబోలుబావి వద్ద ఫారెస్టు బీటు సిబ్బందితో కలసి కూంబింగ్ చేపట్టారు. రాజుపాలెంబీటు పరిధిలోని వెంకటరమరాజుపేట నుండి పడమర వైపుకు చేరుకోగా కొంత మంది వ్యక్తులు టెంపోట్రావెలర్ దిగుతూ అనుమానాస్పదంగా కనిపించారు. వారిని చుట్టుముట్టుగా అడవిలోని వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. వారి వద్ద ఏడు ఇనుప గొడ్డళ్లు, మడతపెట్టిన రంపాలను కనుగొన్నారు. వీరు అడవిలో ఎర్రచందనం చెట్లను నరికేందుకు వచ్చినట్లు విచారణలో తేలింది. దీంతో 18 మంది అరెస్టు చేసి, టెంపో ట్రావలర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీసు స్టేషనులో నమోదు చేసి, ఎస్ఐ సిహెచ్ రఫీ దర్యాప్తు చేస్తున్నారు. పారిపోయిన వారి కోసం స్పెషల్ టీమ్‌లు కూంబింగ్ కొనసాగిస్తున్నట్లు డిఎస్పి మురళీధర్ తెలిపారు. ఆపరేషన్లలో పాల్గొన్న సిబ్బందికి ఎస్పి పి. శ్రీనివాస్ అభినందించి రివార్డులు ప్రకటించారు.

## ఏకంలో అయోధ్య బాలరాముని ప్రాణ ప్రతిష్ట వేడుకలు



వరదయ్యపాలెం, జనవరి 22 ప్రభాతవార్త : వరదయ్యపాలెం, బిఎన్ కండ్రిగ మండలాల్లో సంతోష పురం, గాంధీ పురం, మొక్కల చేను, రామాపురం (రామిరెడ్డిపాలెం గిరిజన కాలనీ), కృష్ణాపురం (కాంబాక్కం గిరిజన కాలనీ), లోకా ఫౌండేషన్ వరల్డ్ విలేజెస్ డెవలప్మెంట్‌లో భాగంగా మౌలిక వసతులే కాకుండా ఏకం ఆధ్వర్యంలో అధ్యాత్మిక కార్యక్రమం సైతం చేపట్టారు. గోవర్ధనపురం లోకా ఫౌండేషన్ కార్యాలయం ఆవరణంలో లోకా పౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ లోకేష్ జి ఆధ్వర్యంలో బాలరాముని ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం ప్రజలు వీక్షించేందుకు తగు ఏర్పాట్లు చేశారు. ప్రాణ ప్రతిష్ట అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. సాయంత్రం శ్రీరాముని శ్రీమూర్తికి భక్తుల గోత్ర నామాలతో అర్చనలు, పూజ కార్యక్రమం నిర్వహించారు. మహిళలు దీపాలు వెలిగించి పండుగ వాతావరణంను కల్పించి, పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అర్చకులు నారాయణాచారులు, వేద మంత్రాలతో కార్యక్రమం నిర్వహించగా స్థానిక మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

## వీధి కుక్కల సమస్యను పరిష్కరిస్తాం : కమిషనర్

తిరుపతి కార్పొరేషన్, జనవరి 22 ప్రభాతవార్త : తిరుపతి నగరంలో వీధి కుక్కల సమస్యలను దశలవారిగా పరిష్కరిస్తామని తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత అన్నారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ కమిషనర్, అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమంలో కమిషనర్ హరిత అర్జీలు స్వీకరించగా, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ పాల్గొన్నారు. సోమవారం డయల్ యువర్ కమిషనర్‌కు 15, స్పందనకు 10 ఫిర్యాదులు అందగా, వాటిలో ముఖ్యంగా మంచాల వీధి, అనంత వీధుల్లో వీధి కుక్కల సమస్యలు ఎక్కువగా ఉన్నాయనే ఫిర్యాదులపై కమిషనర్ స్పందిస్తూ వీధి కుక్కల సమస్యలపై నిరంతరం చర్యలు తీసుకుంటున్నామని, ముఖ్యంగా ఫిర్యాదులు వచ్చిన ఏరియాల్లోని కుక్కలను ప్రత్యేక టీమ్ ద్వారా పట్టుకొని తూకివాకం దగ్గరున్న కుక్కల కేంద్రంలో వాటికి వ్యాక్సిన్లు వేయించడం, పునరుత్పత్తి కాకుండా ఆపరేషన్లు చేయించడం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మున్సిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ అధికారులు కెఎల్ వర్మ, సేతుమాధవ్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్వేష్ రెడ్డి, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర రెడ్డి, మేనేజర్ చిట్టిబాబు, డిఈలు, సూపరింటెండెంట్లు, ఆర్ఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## బస్సు ఎక్కుతూ జారిపడి విద్యార్థి మృతి

సత్యవేడు, జనవరి 22 ప్రభాతవార్త: బస్సు ఎక్కుతూ ప్రమాదవశాత్తు జారిపడి ఓ విద్యార్థి మృతిచెందిన సంఘటన సత్యవేడు మండలంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని శిరనంబుదూరుకు చెందిన శేఖర్ కుమారుడు దివాకర్(17) నాగలాపురంలోని ఓ ప్రయివేట్ ఐటిఐ కాలేజ్‌లో చదువుతున్నాడు. కాలేజ్‌కు వెళ్ళేందుకు ఓ ప్రయివేట్ బస్సు ఎక్కాడు. మార్గంమధ్యలో చెన్నేరి వద్ద ప్రయాణీకులు దిగిన తరువాత తిరిగి బస్సు ఎక్కేందుకు ప్రయత్నిస్తుండగా అదుపుతప్పి జారిపడి కిందపడ్డాడు. తీవ్ర గాయాలపాలైన దివాకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్యవేడు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఊరురా శ్రీరామ నామం



బంగారుపాళ్యం, జనవరి 22 ప్రభాతవార్త: జై శ్రీరామ్, జైజై శ్రీరామ్ నినాదాలతో గ్రామాలు మారుమోగాయి. సోమవారం ఆయోధ్య నగరంలో శ్రీరామ జన్మభూమి నందు బాలరాముడి విగ్రహ ప్రతిష్ట అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని ప్రతి గ్రామంలో శ్రీరాముడి భక్తులు ఆయన నామ స్మరణతో భగవంతుడిని స్మరించుకొన్నారు. మండల కేంద్రం బంగారుపాళ్యం నందు ముత్యాలమ్మ ఆలయం వద్ద సీతారాముల చిత్ర పటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పాల ఏకరి కార్పొరేషన్ ఛైర్మన్ ఎంబి కుమార్‌రాజా, బంగారుపాళ్యం సర్పంచ్ ఉమాదేవి, సింగిల్‌విండో ఛైర్మన్ దత్తాత్రేయరెడ్డి, కృష్ణమూర్తి, ఉప సర్పంచ్ కామరాజు, మురారి, మధుసేన్, మోహన్‌లాల్, కాలురామ్, రాజేంద్రప్రసాద్, ఉమాపతి, పులిచెర్ల ప్రసాద్ తదితరులు అన్నదాన కార్యక్రమంను నిర్వహించారు. బోడబండ్ల గ్రామంలో సాయంత్రం శ్రీరామ భజన మందిరం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. నల్లంగాడు కోటూరు నందు సాయంత్రం అన్నదానం నిర్వహించారు. గుంతూరు నందు శ్రీరామ భజన మందిరం నందు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాల్లోని ప్రతి శ్రీరాముడి భజన మందిరం వద్ద శ్రీరాముడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే సాయంత్రం 6 గంటలకు ప్రతి ఇంటి వద్ద ఐదు దీపాలు వెలిగించి దీపారాధనతో సీతారాములును స్మరించుకొన్నారు.

## ఎన్నికల విధులపై పూర్తి అవగాహన

### - నోడల్ అధికారులతో కలెక్టర్ సగిలి షన్మోహన్



చిత్తూరు, జనవరి 22 ప్రభాతవార్త: 2024 ఎన్నికల ప్రక్రియకు సంబంధించి నియమితులైన నోడల్ అధికారులు వారికి కేటాయించిన విధులపై పూర్తి అవగాహన పెంచుకొని బాధ్యతాయుతంగా పని చేయాలని కలెక్టర్ సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో సోమవారం కలెక్టర్ సగిలి షన్మోహన్ ఎన్నికల నోడల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు సంబంధించి మేన్ పవర్ మేనేజ్‌మెంట్, ట్రెనింగ్ మేనేజ్‌మెంట్, మెటీరియల్ మేనేజ్‌మెంట్, ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్‌మెంట్, సైబర్ సెక్యూరిటీ స్వీప్ యాక్టివిటీస్, ఇవిఎం మేనేజ్‌మెంట్, ఎంసిసి, ఎక్స్‌పెండిచర్ మేనేజ్‌మెంట్, పోస్టల్ బ్యాలెట్, ఎలక్ట్రోరల్స్, ఎన్నికల ప్రక్రియలో భాగంగా నిర్వహించే ఇతర విధులకు సంబంధించి నోడల్ అధికారులు పూర్తి బాధ్యతతో విధులు నిర్వర్తించాలన్నారు. సమిష్టి కృషితో సమన్వయంతో పని చేసి ఎన్నికలు సజావు నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్ఓ రాజశేఖర్, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

## సిఎం చేపట్టిన సంక్షేమం చూసి ఓటు

### - ఎంసి విజయానందరెడ్డి

చిత్తూరు, జనవరి 22 ప్రభాతవార్త: సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేసిన సంక్షేమం, అభివృద్ధిని చూసి ఎవరైనా ఓటు వేయాలని చిత్తూరు వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జీ, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ ఎంసి విజయానందరెడ్డి అన్నారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఎంపీ రెడ్డప్పలతో కలిసి సోమవారం ఎంసి విజయానందరెడ్డి చిత్తూరు రూరల్ మండల పరిధిలోని పలు పంచాయతీల్లో ప్రజలను కలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఎంసి విజయానందరెడ్డిలు బిఎన్ఆర్‌పేట శ్రీఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి, ఇంటింటి ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఎంసి విజయానందరెడ్డి బిఎన్ఆర్‌పేటలో వైకాపా కార్యాలయంను ప్రారంభించారు. బిఎన్ఆర్‌పేట, అనంతాపురం, జంగాలపల్లి, చెట్టింతంగాల్ గ్రామాల్లో ఎంపీ రెడ్డప్ప, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు.వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భక్త కన్నప్పకు విశేష అభిషేకాలు



శ్రీకాళహస్తి,జనవరి 22 ప్రభాతవార్త : పరమశివునికి మూఢ భక్తితో కన్నులర్పించి శివైక్యం పొందిన పరమభక్తుడు భక్తకన్నప్పకు ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. సోమవారం ఆలయంలోని భక్త కన్ను విగ్రహానికి విశేష పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమాల్లో ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఆలయ ఇఓ కె.యస్.రామారావు పాల్గొన్నారు.ఆలయ అర్చకులు, వేదపండితుల సారధ్యంలో ముందుగా కలశస్తాపన గావించారు. తరువాత విశేష పూజలు, అభిషేకాలు జరిపారు.తరువాత విశేష అలంకారం జరిపారు.ఈ కార్యక్రమాల్లో ప్రధాన అర్చకులు కరుణాకర్ గురుకుల్, పరిచారకులు గోవిందశర్మ తదితరుల సారధ్యంలో పూజలు నిర్వహించారు.

## ఎన్జీవో కాలనీలో భవిష్యత్‌కు గ్యారంటీ



పుత్తూరు, జనవరి 22 ప్రభాతవార్త : మునిసిపాలిటీలోని 66వ నెంబరు పోలింగ్ బూత్ పరిధిలోని ఎన్జీవో కాలనీలో సోమవారం తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాలి జీవరత్నం నాయుడు, ఎన్.ఎన్.ధనపాల్ ఆధ్వర్యంలో భవిష్యత్‌కు గ్యారంటీ... బాబు ష్యూరిటీ కార్యక్రమం జరిగింది. యూనిట్ ఇన్‌ఛార్జ్ ఎల్లంటి ప్రసాద్‌నాయుడు ఆధ్వర్యంలో స్థానిక ప్రజలు ముఖ్యంగా యువతతో రిజిస్ట్రేషన్లు చేయించారు. టిడిపి సూపర్ సిక్స్ పథకాలను తెలిపే కరపత్రాలను ఇంటింటికీ పంచారు. కార్యక్రమంలో నాయకులు టి.మునస్వామియాదవ్, బి.వి.రమణ, వెంకటాద్రి, గోవర్ధన్, శారదమ్మ, షర్మిల, ధనలక్ష్మి, సుబ్బరత్నమ్మ, మహేష్, అశోక్ తదితరులు

# మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను సమన్వయంతో నిర్వహించాలి: ఇఓ



శ్రీకాళహస్తి,జనవరి 22 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్స వాలను సమన్వయంతో, సమయస్ఫూర్తితో నిర్వహించుటకు సహకరించాలని ఆలయ ఇఓ కె.యస్.రామారావు పిలుపు నిచ్చారు. సోమవారం రాత్రి ఇక్కడి సమావేశంలో హాలులో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసారు. ఇక్కడి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు సంబంధించి ఆర్‌డిఓగా అనుభవం ఉన్న కె.యస్.రామారావు ఇఓగా ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. మార్చి 2 నుంచి ఇక్కడి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించుటకు సన్నాహాలు జరుగుతున్నాయి.ఈ సందర్భంగా ఆలయ ఇఓ రామారావు మాట్లాడుతూ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలంటే ప్రధాన పాత్ర ఇంజనీరింగ్ విభాగానిదే అన్నారు. వారు పాలకులతో సమన్వయంతో చక చకా పనులు చేపట్టాలన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయ ంలో నిర్వహించే ఉత్సవాల్లో మహాశివరాత్రి ఓ పండగ అన్నారు. అన్ని దేవాలయాల కన్నా శ్రీకాళహస్తీశ్వ రాలయంలో 13 రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించటం ఆనవాయితి అన్నారు.కాబట్టి ఈ ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.ఇంజనీరింగ్ పనులు సకాలం లో పూర్తి చేయాలన్నారు.అలాగే ఉత్సవాలను సకాలంలో గ్రామోత్సవం నిర్వహించుటకు సంబంధించి టెంపుల్ ఇన్స్పెక్టర్లు, ఇన్‌చార్జిలు సమన్వయంతో పని చేయాల న్నారు. ప్రతి రోజూ ఉత్సవంను జనం తిలకించే రీతిలో ప్రణాళికలు రూపొందించుకొని అమలు చేయాలన్నారు. ప్రధానార్చకులు సంబంధం గురుకుల్, కరుణాకర్ గురుకుల్, పారోహితుడు అర్ధగిరి,అలంకార గురుకుల్ సూరి, సురేష్‌గురుకుల్స్,డెప్యూటీ ఇవో వెంకటసుబ్బయ్య, ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, ఇఇ నూకారత్నం, డిఇఇ శ్రీనివాసులురెడ్డి,ఎఇలు ధనపాల్, లోకేష్‌రెడ్డి,సూపరింటెండెంట్ శ్రీహరి,పిఆర్ఓ కిషోర్‌కుమార్‌రెడ్డి, ఇంజనీరింగ్ శాఖకు చెందిన ప్రతాప్,సతీష్‌మాలిక్,ప్రసాద్,నాగభూషణం యాదవ్, వెంకటస్వామి, విజయసారధి తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు హామీలను ప్రజలు నమ్మరు

### వైసిపి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి

వెంకటగిరి, జనవరి 22, ప్రభాతవార్త : టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఇస్తున్న హామీలను ప్రజలు నమ్మరని వైసిపి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి తెలిపారు. వెంకటగిరిలోనే నేదురుమల్లి భవనంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2014 ముందు చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. బాబు వస్తే జాబ్ వస్తుంది అని చెప్పి కుమారుడికి మంత్రి పదవి ఇచ్చినట్లు విమర్శించారు. వెంకటగిరిలో చంద్రబాబు నాయుడు చేసిన ఆరోపణలు ఎవరు రాసిస్తే చదివాడని ఆయన వాస్తవాలు తెలుసుకోవాలన్నారు. తనను బిక్షగాడని చేసిన ఆరోపణకు ఇంకా ఎక్కువగా మాట్లాడగలనని కానీ తాను మాట్లాడానని ఆయన విజ్ఞతకే వదిలి వేస్తున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఎలాంటి అభివృద్ధి చేయలేదని తెలిపారు. ఆయన తాను ఎంతో చేశానని గొప్పలు చెప్పుకోవడం తప్ప ఇంకేమీ లేదన్నారు. ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి వెంకటగిరిలో అభివృద్ధి చేయకపోగా అవినీతికి పాల్పడ్డారని విమర్శించారు. జగనన్న లేఔట్‌లో కూడా ఆయన అవినీతికి పాల్పడినట్లు చెప్పారు. సమావేశంలో వైసిపి నాయకులు లక్కమనేని కోటేశ్వర రావు, ప్రసాద్ రెడ్డి, మల్లికార్జున్ రెడ్డి, సుబ్బరామయ్య తదితరులు పాల్గొన్నారు.

## మలిదశ పనులకు ప్రతిపాదనలు : మంత్రి పెద్దిరెడ్డితో చర్చ



చౌడేపల్లి, జనవరి 22 ప్రభాతవార్త : శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో మలిదశ పనుల వివరాలను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి పాలక, అధికార వర్గం అందించింది. తిరుపతి మంత్రి పెద్దిరెడ్డి నివాసంలో ఆలయ ఛేర్మన్ నాగరాజరెడ్డి, ఇఓ చంద్రమౌళిలు కొండపై తలపెట్టిన రెండవ దశ అభివృద్ధి పనులను చర్చించారు. ఈ మేరకు రూ. 36కోట్లతో తయారు చేయబడ్డ నమూనాలను వివరించి ప్రభుత్వం నుంచి మంజూరుకు ప్రతిపాదించారు. అదే విధంగా మాఘమాసంలో నిర్వహించబోయే లక్షకుంకుమార్చనా ఆహ్వాన పత్రికను మంత్రి పెద్దిరెడ్డి ఆవిష్కరించారు.

## బాలరాముని ఆలయం ప్రారంభం...అందరికీ శుభకరం

### -పేదలకు అన్నదానం చేసిన పిసిరాయలు



తిరుపతి,జనవరి 22ప్రభాతవార్త: అయోధ్యలో హిందువుల పవిత్రమైన శ్రీరామమందిరం ఆలయం ప్రారంభోత్సవం అందరికీ శుభకరమని కస్తూర్బా గాంధీ కేంద్రట్రస్ట్ ఛైర్మన్,మేనేజింట్ ట్రస్టీ డాక్టర్ పిసి రాయలు తెలిపారు. శ్రీరామ మందిరం ప్రారంభోత్సవాన గాంధీరోడ్డులోని ట్రస్టు కార్యాలయంలో తిరుపతి నగరవాసులకు అయోధ్యరాముని అక్షతలతో దీవించి అన్నదానం చేశారు. రాముడు జనం సంతోషాన్ని కోరుకున్నాడని, రామరాజ్యం రావడానికి మందిరం ప్రారంభోత్సవం సంతోషమన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్ రుద్రరాజు శ్రీదేవి, బండి మధుసూధనరెడ్డి, ఉదయగిరి కృష్ణమూర్తి, సుబ్రమణ్యంరెడ్డి, ఉమాపతి, ట్రస్ట్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## చంద్రబాబుతోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అగ్రగామి



చిత్తూరు, జనవరి 22 ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యం లోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుస్తోందని మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు పేర్కొన్నారు. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని దొడ్డిపల్లి, రామ్‌నగర్ కాలనీల్లో సోమవారం మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు ఆధ్వర్యంలో మాజీ మేయర్ కఠారి హేమలత, కాజూరు బాలాజీ, గురజాల జగన్మోహన్‌నాయుడు, చంద్రప్రకాష్, సిఆర్ రాజన్‌లతో నాయకులు, కార్యకర్తలు కలిసి తెలుగుదేశం పిలుస్తోంది. రా కదలిరా.. కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి వెళ్ళి తెలుగుదేశం పార్టీ రూపొందించిన మేనిఫెస్టోను ప్రజలకు అందింది తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజా సంక్షేమం కోసం అమలు చేసే పథకాల వివరాలను వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజల చెంతకే ప్రభుత్వ కార్యాలయాలు : మోహిత్



తిరుపతిరూరల్, జనవరి 22 ప్రభాతవార్త: ప్రజలకే మెరుగైన సేవలందించటానికి... ప్రజల చెంతకే ప్రభుత్వ కార్యాల యాలను నిర్మించడం హర్షణీయమని తుడ ఛైర్మన్, వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నారు. తిరుపతి రూరల్ బ్రాహ్మణపట్టు గ్రామపంచాయతీలో ఒకే చోట నూతనంగా నిర్మించిన ప్రభుత్వ భవనసముదాయాలను (గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, మహిళా స్వయం సహాయక భవనం) సోమవారం తుడ ఛైర్మన్ ప్రాంభించారు. ఈ సందర్భంగా మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వసంక్షేమ పథకాలు అందుకున్న లబ్దిదారుల వివరాలను సచివాల యంలో ప్రదర్శించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తిరుపతిరూరల్ ఎంపిపి యశోధ, బ్రాహ్మణపట్టు సర్పంచ్ తండ్లం నాగజ్యోతి, ఉపసర్పంచ్‌హేమావతి, మాజీ సర్పంచ్, వైకాపా సీనియర్ నేత తండ్లం సుబ్రమణ్యంరెడ్డి, ఎంపిటిసిలు యోగానందరెడ్డి, ఇంద్రాణి, గ్రామ కమిటీ అధ్యక్షుడు మునస్వామిరెడ్డి, డిల్లీబాబు, వేణు తదితరులు పాల్గొన్నారు.

## ముడిపల్లిలో మంత్రి రోజా పూజలు



నగరి, జనవరి 22 ప్రభాతవార్త:మండలంలోని ముడిపల్లిని పురాతన కోదండరామాలయంలో మంత్రి రోజా శ్రీరాముని విగ్రహ ప్రతిష్ట సందర్భంగా నిర్వహించిన పూజలో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు ఆమెకు ఘనంగా స్వాగతం పలికి భజన, అర్చన కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. అర్చకులు ఆలయ ప్రసాదాలు అదజేసి ఆమెను ఆశీర్వదించారు. ఆమె వెంట ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీపీ కన్నియప్ప, మాజీ ఎంపీపీ జయ చంద్రారెడ్డి, సర్పంచ్ ప్రకాష్, చంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## వేడుకగా అన్నమయ్య సంకీర్తనల...అఖండ మహాయజ్ఞం



తిరుపతి,జనవరి 22ప్రభాతవార్త: అన్నమాచార్య కళామందిరంలో అన్నమయ్య సంకీర్తనల అఖండ మహాయజ్ఞం కార్యక్రమం మొదలైంది. సోమవారం ఉదయం టిటిడి అన్నమాచార్యప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భాగంగా టిటిడి పరిపాలన భవనంలో అన్నమయ్య ఉత్సవ విగ్రహానికి పూజలు నిర్వహించారు. అక్కడ నుండి అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు సంకీర్తనలు ఆలపిస్తూ మేళతాళాల మధ్య ఊరేగింపుగా కోదండరామాలయ మాఢవీధులు మీదుగా అన్నమాచార్యమందిరంకు చేరుకున్నారు. ఉదయం 11గంటల నుండి అన్నమయ్య సంకీర్తనల అఖండ మహాయజ్ఞం ప్రారంభమైంది. 24గంటల పాటు ఈ సంకీర్తనలు కళాకారులు ఆలపిస్తారు.

## ఆలయాల్లో రంగస్థలి ప్రత్యేక దీపపు పూజలు



తిరుపతి,జనవరి 22ప్రభాతవార్త: అయోధ్యలో రామ మందిరం ప్రారంభోత్సవం శుభసమయంలో సోమవారం ఉదయం ఆధ్యాత్మిక నగరం తిరుపతిలోని ఆలయాల్లో రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు,దీపాలు వెలిగించారు.అయోధ్యలోని రామమందిరంలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ట కార్యక్రమం ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా వైభవంగా జరగడం, ఈ శుభవేళ ఆలయాల్లో రాయల సీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి, కళాకారులు పొన్నాలజేజిరెడ్డి, అక్కిపల్లి మునికృష్ణయ్య యాదవ్, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, కెఎన్ రాజా, కస్పాపద్మనాభం, దీపక్‌యాదవ్ తదితరులు దీపారాధన కార్యక్రమాలు చేపట్టారు.

## బ్లూమింగ్ బడ్స్ విద్యార్థుల జై శ్రీరామ్ నినాదం



చంద్రగిరి, జనవరి 22 ప్రభాతవార్త: ఆయోధ్యలో బాలరాముడు విగ్రహ ప్రతిష్టను పురస్కరించుకుని సోమవారం బ్లూమింగ్ బడ్స్ విద్యార్థులు జై శ్రీరామ్ అంటూ నినదిస్తూ పట్టణ వీధుల్లో హోరెత్తించారు. ప్రపంచంలోని కోట్లాది మంది భారతీయుల ఛిరకాల కోరిక అయోధ్యలో రామ మందిర నిర్మాణమని పాఠశాల ఛైర్మన్ బి.హితేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. ఆధ్యాత్మిక చింతనతో విద్యార్థులు జైశ్రీరామ్ నినాదాలతో హోరెత్తించారు. ప్రిన్సిపాల్ వేణుగోపాల్ రెడ్డి, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ద స్కూల్‌లో శ్రీరామ విగ్రహ ప్రతిష్ట వేడుకలు



శ్రీకాళహస్తి, జనవరి 22 ప్రభాతవార్త : పట్టణంలోని దస్కూల్‌లో అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా శ్రీరాముడి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు పి.విశాల మాట్లాడుతూ కుల, మతాల కు అతీతంగా శ్రీరాముడు రాజధర్మా న్ని పాటించారన్నారు. కుటుంబ వ్యవస్థ, తల్లిదండ్రుల పట్ల ఎలా నడుచుకోవాలో సమాజానికి తెలియ జేశారని ఆమె వివరించారు. అనంతరం శ్రీరాముడు, అయోధ్య చరిత్రను తెలిపే పుస్తకాన్ని విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్‌కు సత్కారం



శ్రీకాళహస్తి, జనవరి 22 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు హైదరాబాదు లోని న్యూమంత్స్ కున్సు ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా బుద్ధ బోధి ధర్మ అవార్డును మారి గోల్డ్ ఫంక్షన్‌హాలులో సినినటుడు నరేష్, జయసుధ, సుమలత, మురళీ మోహన్ సమక్షంలో అందుకున్నాఉ. ఈసందర్భంగా కమిషనర్‌ను సత్కరించి ఆయన సేవలను కొనియాడారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అవార్డు రావడం గర్వకారణంగా ఉందని పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతామన్నారు.

## ఇంటింటికి ఆయోధ్య శ్రీరామాల అక్షింతలు అందజేత

చిత్తూరు, జనవరి 22 ప్రభాతవార్త: చిత్తూరు కట్టమంచి శ్రీ షిరిడీ విశ్వసాయి బాబా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆయోధ్యలోని శ్రీబాలరాముల ఆలయ ప్రాణ ప్రతిష్ట పురస్కరించుకొని సోమవారం మాజీ ఎమ్మెల్యే సికె బాబు, ఆయన సతీమణి సికె లావణ్యబాబులు ఇంటింటికి ఆయోధ్య శ్రీరామ దేవాలయ అక్షింతలు అందజేశారు. ఉదయం శ్రీరాముల చిత్రపటంను శ్రీ షిరిడీ విశ్వసాయిబాబా ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కట్టమంచి, చర్చివీధి, మార్కెట్ చౌక్, బజారు వీధుల్లో ఊరేగించారు.